సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 23.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 351
పేజీలు: 08 వెల: రూ. 5

రెచ్చగొట్టే డిబేట్లకు చెక్

టీవీ ఛానళ్లకు కేంద్రం హెచ్చరిక

- టీఆర్పీ కోసం హద్దులు దాటొద్దు
- ఛానళ్లకు కీలక మార్గదర్శకాలు
- భద్రతా ఆపరేషన్ల లైవ్ టెలికాస్ట్ వద్దు
- విద్వేష వ్యాఖ్యలకు నో చెప్పండి
- బాధితుల గుర్తింపు బయటపెట్టొద్దు
- ప్రసారాలపై కేంద్రం ఆంక్షలు



02

హైదరాబాద్ సభ రద్దు వెనుక రాజకీయం

ఢిల్లీకి కాంగ్రెస్ మహా గర్జన!

- ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ కేడర్.. మహేష్ గౌడ్‌కు కీలక బాధ్యత
- హైదరాబాద్ సభతో రిస్క్ వద్దనుకున్నారా?
- రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ సమరశంఖం
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో కాంగ్రెస్ పోరు
- జన సమీకరణపై ఏఐసీసీ ఫోకస్..
- తెలంగాణ కాంగ్రెస్‌కు టార్గెట్
- ఢిల్లీ మహా గర్జనతో కాంగ్రెస్ బలప్రదర్శన

- నవంబర్ 1న హస్తినలో కాంగ్రెస్ పవర్ షో
- సొంత గడ్డపై సభకు వెనుకడుగు.. కారణం అదేనా?
- మహా గర్జన వేదిక మార్పు వెనుక రాజకీయ వ్యూహం!
- నవంబర్ 1న తేలనున్న లెక్కలు



ముద్ర, హైదరాబాద్ :

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మహా గర్జన భారీ బహిరంగ సభ వేదిక ఆకస్మికంగా హైదరాబాద్ నుంచి నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానానికి మారింది. తొలత ఈ జాతీయ స్థాయి శక్తి ప్రదర్శనను తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా నిర్వహించాలని భావించినప్పటికీ, అనూహ్యంగా వ్యూహాన్ని మార్చుకుని జాతీయ రాజధాని వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అడుగులు వేసింది. దీంతో తెలంగాణలోని గ్రామ స్థాయి సర్పంచ్‌ల నుంచి శాసనసభ్యులు, ఎంపీలు, మంత్రుల దాకా అధికార యంత్రాంగం, పార్టీ కేడర్ అంతా హస్తిన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భారీ తరలింపు బాధ్యతను ఏఐసీసీ నేరుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ భుజస్కంధాలపై మోపడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

హైదరాబాద్ సభను ఎందుకు వాయిదా వేసుకున్నట్లు?

ముందుగా అనుకున్నట్లుగా హైదరాబాద్‌లో ఈ సభను నిర్వహించకుండా చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం వెనుక బలమైన రాజకీయ,ఆత్మరక్షణ కారణాలు ఉన్నాయనే ప్రచారం జోరందుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్న తరుణంలో.. స్వయంగా తమ సొంత పాలన సాగుతున్న రాజధానిలోనే జాతీయ స్థాయి నిరసన లేదా ఆందోళన సభను నిర్వహిస్తే, అది విపక్షాలకు బలమైన రాజకీయ అస్త్రంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది.

'అధికారంలో ఉండి కూడా హైదరాబాద్‌లో సభ పెడుతున్నారంటే మీ ప్రభుత్వ గెలుపుపై మీకే నమ్మకం లేదా?' అని బీఆర్ఎస్, బీజేపీలు ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ అధిష్టానం ఈ వెనకడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

సొంత పార్టీ గెలుపుపై అపనమ్మకం వ్యక్తమైనట్లేనా?

మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్న సమయంలో క్షేత్రస్థాయిలో రైతుల ఎల్‌నినో నష్టపరిహారం, పవర్ ట్రూ-అప్ ఛార్జీల వడ్డన , మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తి కూడా ఈ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. మిగతా 02లో

బీసీ లెక్కలు సవరిస్తాం

కులగణన లెక్కలపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తాం
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

ముద్ర, తెలంగాణ బ్యూరో:

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. పండేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.



తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. మిగతా 02లో



02

ప్రకృతితో మమేకం కాకపోతే.. విపత్తులు తప్పవు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

- హైదరాబాద్‌లో 'అలయ్ బలయ్'..
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ వేడుకలు
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం
- 'నషా ముక్త్ భారత్' థీమ్‌తో ఈ ఏడాది వేడుకల నిర్వహణ
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు

ఆలోచించి సాగు చేయండి

నష్టాలు కొని తెచ్చుకోవద్దు



02

- అవగాహన లేకుండా పంటలు వేసి నష్టపోవద్దు
- రైతాంగానికి మంత్రి తుమ్మల పిలుపు
- భూసార పరిరక్షణకు ప్రాధాన్యం

75 శాతం మార్కులొస్తేనే డ్రైవింగ్ లైసెన్స్

కొత్త రూల్స్ తెస్తున్న కేంద్రం

- అడ్రస్ మార్పునకు 15 రోజుల గడువు
- వివరాల సవరణకు రూ.200 ఫీజు రద్దు
- కొత్తగా ఆటోమెటిక్ ఆమోదం నిబంధన
- కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు



02

ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ

కూతురు ప్రియాంకతో సందడి

- ముగ్గురినే ఫాలో అవుతున్న అగ్రనేత
- నవంబర్ 10న పుస్తకం విడుదల..
- ఇన్‌స్టాలో ఫస్ట్ లుక్ షేర్ చేసిన సోనియా
- యువతను చేరుకునేందుకు కొత్త అడుగు..



02

నో కాన్వాయ్.. నో సెక్యూరిటీ

చంద్రబాబు వద్దకు పవన్ కళ్యాణ్

- సుప్రీం తీర్పు వేళ సంచలన భేటీ
- కూటమి నేతల వ్యూహమేంటి?
- 48 గంటల గడువుపై చర్చ..
- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు –పవన్ ఫోకస్
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలే టార్గెట్..
- కూటమి నేతల మంతనాలు
- విపక్షాల ఎత్తుగడలకు చెక్ పెట్టే వ్యూహం..
- అమరావతిలో హాట్ టాపిక్‌గా పవన్ భేటీ



02

పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపు ఆపండి

ఏదుల నుంచి నీటి తరలింపుతో ఆయకట్టుకు ఇక్కట్లు

- డిండి ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయ మార్గంలో నీరివ్వండి
- మంత్రి ఉత్తమ్‌కు జిల్లా ప్రతినిధుల విజ్ఞప్తి
- అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: ఉత్తమ్



02

ఇదీ AI ముద్ర

అట్లాంటిక్ సముద్రానికి తన పేరు పెట్టాలని కాల్ చేసిన ట్రంప్.. నో చెప్పిన గూగుల్ సీఈవో సుందర్



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 23 అక్టోబర్, 2026

వికారం తగ్గించడంలో ఉపయోగకరం

ప్రయాణాల్లో వాంతులు వచ్చినట్లు అనిపించడం, వికారం వంటి సమస్యలను తగ్గించడంలో అల్లం సహాయపడవచ్చు. గర్భధారణ సమయంలో వచ్చే వికారానికి కూడా కొందరిలో ఉపశమనం కలిగించవచ్చు. అయితే గర్భిణులు అల్లం సప్లిమెంట్లు తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి.



హైదరాబాద్ సభ రద్దు వెనుక
రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో సభ పెడితే జనసమీకరణలో ఏమాత్రం లోటుపాట్లు జరిగినా, లేదా ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందని విపక్షాలు ట్రోల్ చేసినా అది పీసీసీ విజయంపైనే పెను సందేహాలను రేకెత్తిస్తుంది. అందుకే, అధికారంలో ఉన్న సొంత గడ్డపై ఎలాంటి రిస్క్ తీసుకోకుండా సభను నేరుగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి తరలించడమే సురక్షితమైన మార్గమని భావించారు.

సీఈసీ రాజీనామాకు ఒత్తిడి

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో జరగనున్న ఈ మహా గర్జన కు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను సైతం సమీకరిస్తుండటంతో, దీని ప్రాధాన్యత జాతీయ స్థాయికి చేరింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, నిరుద్యోగం వంటి అంశాలపై ఏఐసీసీ సమరశంఖం పూరిస్తోంది. ఈ క్రమంలోనే దక్షణాది నుంచి ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసి ఢిల్లీ పీఠాన్ని కదిలించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఏఐసీసీ భారం మోపింది. తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌ను హస్తినకు తరలించే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం నుంచి ప్రతి నియోజకవర్గం నుంచి ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసి పదివేల మందికి పైగా ద్వితీయ శ్రేణి నేతలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లను ఢిల్లీకి తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు కచ్చితంగా తమ అనుచరగణంతో ఢిల్లీలో హాజరవ్వాలని ఇప్పటికే అంతర్గత ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన భారాన్ని ఢిల్లీ తరలింపు ద్వారా భుజాన వేసుకున్నట్లయింది.

హైదరాబాద్ సభ రద్దు వెనుక సొంత ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుకునే డిఫెన్సివ్ వ్యూహం ఉన్నప్పటికీ, ఢిల్లీలో జాతీయ స్థాయి పవర్ షో ద్వారా రేవంత్ రెడ్డి సర్కార్ తన పట్టును అధిష్టానానికి నిరూపించుకోవడానికి ఇది ఒక అవకాశంగా మారింది. సొంత రాజధానిలో సభ పెట్టి ఉంటే వచ్చే విమర్శల నుంచి తప్పించుకున్న కాంగ్రెస్, ఇప్పుడు హస్తినలో ఏ స్థాయిలో జన సమీకరణ చేసి తన శక్తి యుక్తులను నిరూపించుకుంటుందో నవంబర్ 1న స్పష్టం కానుంది.

నో కాన్వాయ్.. నో సెక్యూరిటీ

ముద్ర, అమరావతి :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన, మునుపెన్నడూ చూడని వినూత్న సన్నివేశం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ ఎలాంటి అధికారిక ప్రొటోకాల్, సైరన్ కార్లు, భద్రతా సిబ్బంది , కన్వాయ్ ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ పౌరుడిగా నేరుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. స్థానిక సంస్థల నామినేషన్ల ఘట్టం, ఏకగ్రీవాలపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే జరిగిన ఈ భేటీ అమరావతి రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. అధికార హోదాలో ఉన్న ఇద్దరు అగ్రనేతలు నిమిషాల వ్యవధిలో ఎలాంటి హంగామా లేకుండా ముఖాముఖి సమావేశమవ్వడం వెనుక స్థానిక సమరం, పరిషత్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వ్యూహాలపై చర్చించనున్నారు.

ఈ ఆకస్మిక భేటీకి ప్రధాన కారణం.. ఏపీ స్థానిక ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయలేకపోయిన విపక్షాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని మరో 48 గంటల సమయం కేటాయించాలని, ఎస్ఈసీ దీనిపై సమీక్షించి రీ-నామినేషన్లను అనుమతించాలని సుప్రీంకోర్టు చేసిన సూచనలే. ఈ పరిణామం వల్ల 19 మున్సిపాలిటీలతో పాటు పరిషత్ మరియు



పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుంది? న్యాయపరమైన ఆదేశాలను క్షేత్రస్థాయిలో ప్రభుత్వం, పోలీసులు ఎలా ఎదుర్కోవాలి? అనే అంశంపై చంద్రబాబు-పవన్ లోతుగా చర్చించారు. కోర్టు ఆదేశాలను బేషరతుగా అమలు చేస్తూనే, వైఎస్సార్‌సీపీ చేస్తోందే నెగెటివ్ ప్రచారాన్ని రాజకీయంగా ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇద్దరు నేతలు చర్చిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ముఖ్యంగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల సీట్ల సర్దుబాటు, నామినేషన్ల వ్యూహం ఈ భేటీలో ప్రధాన అజెండాగా నిలిచింది. మున్సిపల్ నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నాటకీయ పరిణామాలకు తెరలేపి కోర్టును ఆశ్రయించినందున.. రాబోయే పరిషత్ ఎన్నికల్లో అలాంటి అవకాశాలు విపక్షాలకు దక్కకుండా పక్కా యంత్రాంగంతో నామినేషన్లు వేయించాలని నిర్ణయించారు. ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించి, గ్రామస్థాయిలో కూటమి ఓటు బ్యాంకు చెల్లాచెదురు కాకుండా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలని ఉమ్మడి వ్యూహం ఖరారు చేశారు.


అయితే, డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా పవన్ కళ్యాణ్ ఎలాంటి కన్వాయ్ లేకుండా చంద్రబాబు నివాసానికి రావడం ఆసక్తికరంగా మారింది. పార్టీ పనుల కోసం కాబట్టే పవన్ అన్నీ వదిలేసి పచ్చారని అంటున్నారు. పాలన, కూటమి ధర్మం విషయంలో అధికారిక ఆర్భాటాల కంటే, క్లిష్ట సమయంలో పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లడమే ప్రాధాన్యం అనే సందేశాన్ని పవన్ ఈ చర్య ద్వారా తన శ్రేణులకు అందించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పవన్ - చంద్రబాబు క్రమం తప్పకుండా సమావేశమవుతున్నప్పటికీ, ఈ నాటకీయ శైలి భేటీ మాత్రం పొలిటికల్ సర్కిళ్లలో విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత ఏర్పడిన చట్టపరమైన, రాజకీయ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి కూటమి అగ్రనేతలు అత్యంత వేగంగా స్పందించారు. భద్రతా వలయాలను పక్కనబెట్టి పవన్ కళ్యాణ్ వచ్చి చంద్రబాబుతో చర్చించడం ద్వారా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు టీడీపీ-జనసేన సిద్ధంగా ఉన్నాయని బలంగా చాటిచెప్పారు. రానున్న 48 గంటల్లో ఎస్ఈసీ తీసుకునే నిర్ణయాలు , క్షేత్రస్థాయి పరిణామాలు ఏపీ రాజకీయాల్లో కీలక మార్పులు తీసుకున్నాయి.

బీసీ లెక్కలు సవరిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



ఇన్‌స్టాగ్రామ్‌లోకి
సోనియా ఎంట్రీ

ముద్ర, తెలంగాణ బ్యూరో :

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లోకి అధికారికంగా అడుగుపెట్టారు. గురువారం ఇన్‌స్టాలో ఖాతా తెరిచిన ఆమె, త్వరలో విడుదల కానున్న తన జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్‌కు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. లైబ్రరీలో పుస్తకాల మధ్య కూర్చుని, తన పుస్తకంలోని పేజీలను తిరగేస్తూ, పాత ఫొటోలను చూస్తూ కూతురు ప్రియాంకా గాంధీ వాద్రాతో నవ్వుతూ ముచ్చటిస్తున్న వీడియోను సోనియా గాంధీ పోస్ట్ చేశారు. ఈ క్షణాలను అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇది ప్రేమ, బాధ్యత, నష్టం, మనకంటూ ఒక చోటును వెతుక్కునే కథ అని ఆమె పేర్కొన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టిన కొద్ది గంటల్లోనే ఆమెకు విపరీతమైన ఫాలోవర్లు పెరిగారు. అయితే ఆమె కేవలం ముగ్గురిని మాత్రమే ఫాలో అవుతున్నారు. వారు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ అధికారిక పేజీ. ఇదిలా ఉంటే.. ఈ పుస్తకంలో ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ (RSS), చైనాతో సరిహద్దుకు సంబంధించిన కొన్ని అంశాలను తొలగించాలని పబ్లిషర్ కోరగా, రచయిత్రి సోనియా గాంధీ దానిని తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మరో పబ్లిషర్ ఈ పుస్తక ప్రచురణ హక్కులను దక్కించుకోగా, నవంబర్ 10న ఈ పుస్తకం మార్కెట్‌లోకి రానుంది. రాజకీయ జీవితంలో సోషల్ మీడియాకు చాలాకాలం దూరంగా ఉన్న సోనియా గాంధీ, నేటి యువతను, ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అడుగువేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

75 శాతం మార్కులొస్తేనే డ్రైవింగ్ లైసెన్స్..

ముద్ర, న్యూఢిల్లీ :

డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు సంబంధించి కేంద్రం కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కోసం నిర్వహించే ఆన్‌లైన్ అసెస్‌మెంట్ పరీక్ష పాస్ మార్కులను 60 శాతం నుంచి 75 శాతానికి పెంచింది. డ్రైవింగ్‌పై అవగాహన కోసం నిర్వహించే ఈ ట్యుటోరియల్ కనీసం 30ని. పాటు సాగాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. భాగస్వామ్యపక్షాల నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

కొత్త ప్రతిపాదనల ప్రకారం.. పేరు, చిరునామా వివరాల మార్పు కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 15 రోజుల్లోగా ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలి. ఒకవేళ తిరస్కరిస్తే తగిన కారణం తెలపాల్సి ఉంటుంది. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. ఆధార్ అథంటికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే కొన్ని డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని భావిస్తున్నారు. పేరు, చిరునామా వంటి వ్యక్తి గత వివరాల మార్పులకూ ఛార్జీలు తొలగించనున్నారు.

గుర్తింపు, వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఇ-రేషన్ కార్డు, గడిచిన 3 నెలల్లోపు వచ్చిన విద్యుత్, గ్యాస్ బిల్లులను అనుమతిస్తారు. చిరునామా ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఎల్ఐసీ పాలసీలను తొలగించాలని ముసాయిదా పేర్కొంది. అలాగే, కొత్తగా జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యువల్ లైసెన్సులను లేమినేటెడ్ లేదా పీవీసీ కార్డు రూపంలో జారీ చేయాలని ముసాయిదాలో కేంద్రం పేర్కొంది.



పాలమూరు-డిండికి నీటి తరలింపును ఆపండి

ముద్ర, హైదరాబాద్:

పాలమూరు నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపును ఆపాలని జిల్లా ప్రతినిధులు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు గురువారం ఉత్తమ్‌తో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు చర్చించారు. డిండి ప్రాజెక్టు విషయంలో ఇబ్బందులను ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నీటిని తీసుకోవాలని కోరారు. డిండి ప్రాజెక్టుకు నీరు ఇచ్చేందుకు తాము వ్యతిరేకం కాదని, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే పాలమూరు ఆయకట్టుకు ఇక్కట్లు ఎదురవుతాయని చెప్పారు. అధికారులతో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ హామీ ఇచ్చారు.

రెచ్చగొట్టే డిబేట్లకు చెక్

ముద్ర, న్యూఢిల్లీ :

కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానళ్లకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. వార్తలు, ప్రత్యేక చర్చలు డిబేట్లు, ఇతర కార్యక్రమాలను ప్రసారం చేసే సమయంలో మరింత బాధ్యతాయుతం గా వ్యవహరించాలని స్పష్టం చేసింది. వేగంగా వార్తలను అందించాలనే పోటీలో విశ్వసనీయతను కోల్పోకుండా.. ప్రజల్లో గందరగోళం సృష్టించకుండా ఉండేందుకు ఈ అడ్వయిజరీ తీసుకొచ్చింది.



దేశ భద్రతకు విఘాతం కలిగించే 'యాంటీ నేషనల్ కంటెంట్'ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రసారం చేయవద్దని కేంద్రం సూచించింది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు, భద్రతా బలగాల కదలికలు, సున్నితమైన వివరాలను ప్రత్యక్ష ప్రసారం లైవ్ టెలికాస్ట్ చేయకూడదని పేర్కొంది. లైవ్ దృశ్యాలు ఉగ్రవాదులకు చేరితే భద్రతా బలగాల వ్యూహాలు దెబ్బతిని, జవాన్లు, పౌరుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల అధికారిక సమాచారం వచ్చిన తర్వాతే నిర్ధారించుకొని ప్రసారం చేయాలి.

రెచ్చగొట్టే డిబేట్లు, టీఆర్పీ ప్రాధాన్యం వద్దు

టీఆర్పీ రేటింగ్స్ కోసం వార్తలను అతిశయోక్తిగా చూపించడం, ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడం సరికాదని కేంద్రం హెచ్చరించింది. రాజకీయ, మత, సామాజిక అంశాలపై చర్చలు నిర్వహించేటప్పుడు విద్వేషాలను పెంచే వ్యాఖ్యలు లేదా వ్యక్తిగత ధూషణలకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. భిన్నాభిప్రాయాలను తెలియజేయడం మీడియా బాధ్యత అయినప్పటికీ సామాజిక సామరస్యానికి భంగం కలగకూడదు.

లైంగిక దాడుల బాధితుల పేర్లు, ఫొటోలు, చిరునామాలు లేదా వారి గుర్తింపు వెల్లడించే ఎలాంటి దృశ్యాలను ప్రసారం చేయకూడదని తెలిపింది. అలాగే భారతదేశ పటాన్ని ప్రసారం చేసేటప్పుడు అధికారిక సరిహద్దులు కలిగిన మ్యాప్‌లను ఉపయోగించాలని స్పష్టం చేసింది.

ఆలోచించి సాగు చేయండి

ముద్ర, హైదరాబాద్:

రైతులు అవగాహన లేకుండా పంటలు సాగు చేసి నష్టపోవద్దని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని పేర్కొన్నారు. గురువారం రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అసమానతలు, భూతాపం పెరుగుదల వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని మంత్రి సూచించారు. భూసార పరీక్షలు చేయించుకొని, నేలలోని పోషకాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులను అధికంగా వాడకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణకు నీటిని పొదుపుగా వినియోగించాలని, డ్రిప్ ఇరిగేషన్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలు, అపరాలు, ప్రాంతానికి అనుకూలమైన ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, పంట వ్యర్థాలను కాల్చకుండా మల్చింగ్‌కు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ అర్హులైన రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యవసాయ పనిముట్లు అందిస్తామని మంత్రి తెలిపారు. ఖేత్ బచావో అభియాన్‌ను నిరంతర ఉద్యమంగా కొనసాగించాలని, రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



ప్రకృతితో మమేకం కాకపోతే.. విపత్తులు తప్పవు

మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ముద్ర, హైదరాబాద్:

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించకపోతే.. విపత్తులు తప్పవని హితవు పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు హాజరయ్యారు.

గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీల నేతలు సైతం తరలివచ్చారు. మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే కార్యక్రమ మే అలయ్ బలయ్ అని వెంకయ్య నాయుడు చెప్పారు. సెక్యులర్ దేశం లో ఏ మతాన్నీ, ఏ పండగనూ తక్కువ చేసి చూడొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ మనందరి లక్ష్యం కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అలయ్ బలయ్ అనేది కుల మతాలు, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతమైన వేదికని దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 23.10.2026
www.mudranews.in | @mudranews

జలుబు సమయంలో అల్లం టీతో ఉపశమనం



అల్లం కలిపిన వేడి టీ గొంతులో అసౌకర్యాన్ని తగ్గించి, వెచ్చదనాన్ని అందిస్తుంది. జలుబు సమయంలో గొంతు నొప్పి, చికాకు నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. అయితే అల్లం జలుబును పూర్తిగా నయం చేస్తుందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

శ్రీధర్ బాబు



ముద్ర, శంషాబాద్ : హైదరాబాద్ –రంగారెడ్డి–మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. శంషాబాద్ లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని, గ్రామాలు, మున్సిపాలిటీలు, వార్డుల వారీగా ప్రత్యేక నమోదు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పట్టభద్రులను కలిసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని, బీఆర్ ఎస్ ,బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త నేతలు విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో పనిచేసి ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా నుంచి పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని కోరారు.

కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం

ముద్ర, కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో స్థానిక ప్రజలు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు, నాయకులు సీఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘర్షణలో డీఆర్‌డీవో ఉద్యోగి మృతి

యువతితో అసభ్య ప్రవర్తన..

ముద్ర, హైదరాబాద్ : పొరుగింటి యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న నెపంతో జరిగిన ఘర్షణలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఉద్యోగి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రామ్మోహన్ (55) గత రెండేళ్లుగా నివాసముంటున్నాడు. ఇతడు డీఆర్‌డీవోలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే, తన ఇంటి పక్కనే నివాసముంటున్న ఓ యువతి పట్ల రామ్మోహన్ గత కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో కూడా సదరు యువతిని రామ్మోహన్ మరోసారి తీవ్రంగా వేధించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన ఆ యువతి కేకలు వేస్తూ పక్కనే నివాసముంటున్న అభిజిత్ అనే యువకుడికి సమాచారం అందించింది. ఆగ్రహానికి లోనైన అభిజిత్ వెంటనే అక్కడికి చేరుకుని.. గత కొంతకాలంగా యువతిని ఎందుకు వేధిస్తున్నావంటూ రామ్మోహన్‌ను గట్టిగా నిలదీశాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. పరస్పర తోపులాటలో అభిజిత్ బలంగా నెట్టివేయడంతో రామ్మోహన్ కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడిన రామ్మోహన్‌ను వెంటనే కాచిగూడలోని నీసీ షరాఫ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రామ్మోహన్ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కాత్యాయిని చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, ఘర్షణకు కారణమైన వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ టెన్త్ పరీక్షల ఫీజు షెడ్యూల్ ఇదే..

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో మార్చి 2027లో నిర్వహించనున్న టెన్త్ (ఎస్ఎస్సీ), ఓఎస్ఎస్సీ , ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ అధికారికంగా విడుదల చేసింది. రెగ్యులర్ , వన్స్-ఫెయిల్ అయిన అభ్యర్థులు సైబర్ ట్రెజరీ ద్వారా ఆన్‌లైన్ ఇంటిగ్రేషన్ పద్ధతిలో పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎంలు) , ప్రిన్సిపాల్స్ తక్షణమే స్పందించి విద్యార్థులకు ఈ సమాచారాన్ని తెలియజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఫీజు చెల్లింపు , దరఖాస్తుల గడువు తేదీలు

అపరాధ రుసుం (లేట్ ఫీజు) లేకుండా అక్టోబర్ 30, 2026 నుంచి నవంబర్ 16, 2026 వరకు విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ప్రధానోపాధ్యాయులు సైబర్ ట్రెజరీ ద్వారా నవంబర్ 17 నుంచి డిసెంబర్ 1, 2026 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు జమ చేయవచ్చు. అలాగే రూ. 50 లేట్ ఫీజుతో నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు, రూ. 200 లేట్ ఫీజుతో డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 14 వరకు, , రూ. 500 లేట్ ఫీజుతో డిసెంబర్ 16 నుంచి డిసెంబర్ 28, 2026 వరకు ఫీజు చెల్లించేందుకు గడువు విధించారు. విద్యార్థుల ఆన్‌లైన్ డేటాను డీఈఓలకు సమర్పించడానికి చివరి తేదీలను కూడా అధికారులు వేర్వేరుగా ఖరారు చేశారు.

పరీక్ష ఫీజు వివరాలు , ముఖ్యమైన మార్గదర్శకాలు

అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ. 125 కాగా, మూడు సబ్జెక్టుల కంటే తక్కువ ఉంటే రూ. 110, మూడు సబ్జెక్టులకు మించితే రూ. 125గా నిర్ణయించారు. ఒకేషనల్ అభ్యర్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా రూ. 60 చెల్లించాల్సి ఉంటుంది. మార్చి 2027 పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ఏ పరిస్థితుల్లోనూ ఫీజు చెల్లింపు గడువు పొడిగించబడదని, సైబర్ ట్రెజరీ ఆన్‌లైన్ ఇంటిగ్రేషన్ ద్వారా మాత్రమే పాఠశాల లాగిన్ ద్వారా ఫీజు చెల్లించాలని సూచించారు. ఐఎఫ్ఎంఐఎస్ (IFMS) పోర్టల్ చలాన్లు లేదా మాన్యువల్ బ్యాంక్ చలాన్లు ఏవీ స్వీకరించబడవని స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఎల్‌నినో వచ్చినా.. విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

రోజువారీ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి
యాదాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లకు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా
మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం
విద్యుత్ బకాయిల పరిష్కారానికి వెసులుబాటు కల్పించేలా డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు
థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు



ముద్ర, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.


విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ''ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ''టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024–25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి'' జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం

తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని TGSPDCL, TGNPDCL సీఎండీలను డిప్యూటి సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పీడిసిఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీలో మంటలు.. తప్పిన ప్రమాదం



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ చొప్పదండి రోడ్డు ఆదర్శ నగర్‌లో ఓ గ్రానైట్ లారీ అగ్ని ప్రమాదానికి గురైంది. ప్రమాదవశాత్తూ డ్రైవర్ క్యాబిన్‌లో అంటుకున్న మంటలు.. క్రమంగా మొత్తం వ్యాపించి లారీ పూర్తిగా దగ్ధమైంది. లారీ పక్కనే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరగడంతో కరీంనగర్ – చొప్పదండి మార్గంలో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించి ముందే బయటకు దూకడంతో ప్రాణ నష్టం తప్పింది.

పండుగ సాయన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత గౌరవం

ముదిరాజ్‌ల రాజకీయ, సామాజిక ఆత్మగౌరవానికి పెద్దపీట.. బీసీ-ఏలోకి మార్పునకు సిద్ధం
పాలమూరు యూనివర్సిటీకి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు పండుగ సాయన్న పేరు పెట్టాలని సీఎం కు విజ్ఞప్తి :మంత్రి వాకిటి శ్రీహరి



ముద్ర, హైదరాబాద్ : మహనీయుల చరిత్రను గౌరవించడం, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... పండుగ సాయన్న ఆశయాలకు అనుగుణంగా ముదిరాజ్‌ల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

పండుగ సాయన్న వంటి మహనీయుల చరిత్రను గుర్తించి, వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం ద్వారా సమాజానికి వారి సేవలను పరిచయం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పండుగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహిస్తూ ఆయనకు తగిన గుర్తింపు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ముదిరాజ్‌ల హక్కుల విషయంలో వెనకడుగు వేయం

రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే ప్రతి కులం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన చేపట్టిందని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయమైన వాటా, సమాన అవకాశాలు కల్పించాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే అంశంపై తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ధైర్యం ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ముదిరాజ్‌లకు న్యాయం చేయాలనే ఆకాంక్షతో పాటు, బీసీ–ఏలో ఇప్పటికే ఉన్న మత్స్యకారులకు ఎలాంటి నష్టం, ఇబ్బంది కలగకుండా పరిష్కారం చూపాల్సిన బాధ్యత కూడా మాపై ఉందన్నారు. ఒక వర్గానికి న్యాయం చేస్తూ మరో వర్గానికి అన్యాయం జరగకుండా, అందరి ప్రయోజనాలను పరిరక్షించే విధంగా తగిన అవకాశాలు కల్పించాలని తెలిపారు.

ఈ నేపథ్యంలో పాలమూరు యూనివర్సిటీకి పండుగ సాయన్న పేరు పెట్టాలని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు కూడా ఆయన పేరు పెట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. పండుగ సాయన్నకు తగిన గౌరవం కల్పించడం ద్వారా ముదిరాజ్‌ల సామాజిక ఆత్మగౌరవానికి మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.ముదిరాజ్‌ల అభ్యున్నతి, బీసీలకు న్యాయమైన వాటా, మహనీయులకు సముచిత గౌరవం అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత..

రైస్ మిల్లుపై దాడి



ముద్ర, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పేదల కోసం కేటాయించిన పీడీఎస్ బియ్యం అక్రమ దందా గుట్టరయింది. సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ , టాస్క్‌ఫోర్స్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో భారీ ఎత్తున రేషన్ బియ్యం అక్రమ నిల్వలు బయటపడ్డాయి. ఇబ్రహీంపట్నంలోని న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్‌లో ఈ దాడులు జరగగా, పేదల బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి మిల్లులో నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు.

మిల్లులో బయటపడిన వేల కిలోల రేషన్ బియ్యం.. లారీ సీజ్

అధికారులు జరిపిన సోదాల్లో రైస్ మిల్లు ప్రాంగణంలో సుమారు 50 కిలోల బరువున్న 677 బస్తాలు, అలాగే 25 కిలోల బరువున్న 101 పీడీఎస్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న ఓ టాటా లారీని (TS-03-UB-3399) కూడా అధికారులు సీజ్ చేశారు. ఆ లారీలో అదనంగా మరో 51 బస్తాల బియ్యం లభించాయి. తనిఖీలు నిర్వహించిన టెక్నికల్ అధికారులు ల్యాబ్ పరీక్షల ద్వారా పట్టుబడిన సరుకు పీడీఎస్ ఫోర్టిఫైడ్ రైస్ (FRK) అని స్పష్టంగా నిర్ధారించారు.

నిందితులపై చట్టపరమైన చర్యలు.. ముమ్మరమైన దర్యాప్తు

ఈ అక్రమ బియ్యాన్ని సిద్దిపేట జిల్లా మోతే గ్రామంలోని భారతి ఇండస్ట్రీస్ నుంచి కొనుగోలు చేసినట్లు మిల్లు యజమాని గీతేష్ బన్సల్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం తెలంగాణ పీడీఎస్ రైస్ కంట్రోల్ ఆర్డర్-2016లోని క్లాజ్ 17(e) కింద నేరమగడంతో అధికారులు కేసు నమోదు చేశారు. ఈ దందాలో భాగమైన న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్ యజమాని గీతేష్ బన్సల్, శ్రీరామ్ లోహియా , భారతి ఇండస్ట్రీస్ ఓనర్ నాగభూషణంపై ఫిర్యాదు చేసి దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 23 అక్టోబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ట్రంప్‌కు శృంగభంగం

తప్పదా



నవంబర్ 3 వ తేదీన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద పరీక్షను ఎదుర్కోబోతున్నారు. ప్రపంచం అంతా ఆరోజు జరగనున్న మిడ్ ఎన్నికల కోసం అసక్తిగా ఎదురు చూస్తుంది. ట్రంప్ విధానాలతో విసిగి వేసారిన అమెరికా ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని ఆయనకు శృంగభంగం తప్పదని పరిశీలకులు అంటున్నారు. ఈ ఎన్నికల్లో అధికార రిపబ్లిక్ పార్టీ ఓడినా, గెలిచినా ట్రంప్ పదవికి ఢోకాలేదు. అయితే అమెరికా కాంగ్రెస్ లో ఆయన ఆటలు సాగవు. దీంతో అమెరికా ప్రజలకే కాకుండా ప్రపంచానికి కొంత రిలీఫ్ దొరుకుతుంది. అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడి ఎన్నిక ప్రతి 4 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు చేసిన వ్యక్తి తిరిగి ఎన్నికల్లో పోటీచేయకూడదు.. అందువల్ల రెండవ సారి ఎన్నికైన ట్రంప్ మరో రెండు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉంటారు. రేపు జరగబోయే మిడ్ ఎన్నికల్లో ఆయన విషమ పరీక్షను ఎదుర్కోబోతున్నారు. 435 మంది సభ్యులు గల హౌస్ అఫ్ రెప్రజెంటేటివ్ (మన లోకసభ సభ్యులుగా) నేరుగా ప్రజల నుంచి ఎన్నికవుతారు. అదే విధంగా హౌస్ అఫ్ సెనేట్ 100 మంది సభ్యులు (మన రాజ్యసభ లాంటిది) ఉండగా వారిలో 35 మంది సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి.. అయితే మన రాజ్యసభ సభ్యులలాగా కాకుండా వీరిని నేరుగా ప్రజలే ఎన్నుకుంటారు. అక్కడ 50 రాష్ట్రాలు ఉండగా ఒక్కక్కొక్క రాష్ట్రం నుంచి ఇద్దరు సెనేటర్స్ ను ఎన్నుకుంటారు. 435 సభ్యులుగల హౌస్ అఫ్ రెప్రజెంటేటివ్ లో అధికార రిపబ్లిక్ పార్టీకి ప్రస్తుతం 218 మంది సభ్యులు ఉండగా ప్రతిపక్ష డెమొక్రాట్లకు 214 మంది సభ్యులున్నారు. ఒక స్వతంత్ర సభ్యుడు ఉండగా మరో రెండు ఖాళీలున్నాయి. 100 మంది సభ్యులున్న సెనేట్ లో రిపబ్లికన్ పార్టీకి 53 మంది డెమొక్రాట్లకు 45 మంది వారిని బలపరిచే మరో ఇద్దరు స్వతంత్ర సభ్యులు ఉన్నారు.

అక్కడ నుంచి అందుతున్న సమాచారం, తాజా సర్వేల ప్రకారం ట్రంప్ పార్టీకి అంటే రిపబ్లిక్ లకు గట్టి ఎదురు దెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయి. దీంతో అధ్యక్షుడుగా ట్రంప్ ఉన్నా, అమెరికా కాంగ్రెస్ లో ట్రంప్ నిర్ణయాలకు ఆమోదం లభించడం సులభం కాదు . అసలే ట్రంప్ పై కోపంగా ఉన్న అమెరికన్లు ఈ మిడ్ ఎన్నికలను అవకాశంగా చూస్తున్నారు. పైగా వివిధ దేశాలతో నిత్యం ఘర్షణలు టారిఫ్ ల గోలతో ట్రంప్ అధికారాలకు చెక్ పెట్టాలనే భావన అమెరికా ప్రజల్లో బలంగా ఉంది. ఇప్పటి వరకు అగ్రరాజ్యంగా ఉండి, ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికా, ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలతో బలహీనపడింది. ఒకరకంగా చెప్పాలంటే ఒంటరైంది. ఇరాన్ పై యుద్ధాన్ని అనేక మిత్ర దేశాలు వ్యతిరేకించాయి. కనీసం యుద్ధ విమానాలను వారి భూభాగంలో దించేందుకు కూడా అంగీకరించలేదంటే ట్రంప్ నాయకత్వంలో అమెరికా పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అమెరికా దేశ చరిత్రలో ఇంతటి బలహీనత ఎప్పుడు లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండో సారి ఎన్నికైన తర్వాత ఆయన తీసుకున్న నిర్ణయాలపై అమెరికా ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది . ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. సొంత పార్టీకి చెందిన రిపబ్లికన్లు సైతం ట్రంప్ నిర్ణయాలతో విభేదిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నిరుద్యోగం పెరిగింది. ఇరాన్ తో యుద్ధం తర్వాత చమురు ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ యుద్ధ ప్రభావం దీనితో సంబంధం లేని అనేక దేశాలపై పడింది. సైన్యంలో ఉన్న కొందరు ఉన్నతాధికారులు సైతం ట్రంప్ నిర్ణయాలను తప్పుపడుతున్నారు. నవంబర్ 3వ తేదీ జరగనున్న ఎన్నికల్లో గెలుపొందేందుకు ట్రంప్ సైతం అమెరికన్లను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన దుందుడుకు ,దుశ్చర్యలతో అమెరికా ఇమేజ్ దెబ్బతీశారని ప్రపంచం ముందు తలదించుకునే పరిస్థితులు కల్పించారని భావిస్తున్న ఓటర్ల తీర్పు కీలకం కానున్నది.. చూద్దాం ట్రంప్ అధికారాలకు కత్తెరపడుతుందో లేదో..!

కే రాంనారాయణ
సీనియర్ జర్నలిస్ట్
టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9177456778

మజ్జిగతో శరీరానికి లాభాలు

సౌత్ ఇండియన్ స్టైల్ మజ్జిగలో నీరు, పెరుగు, ఉప్పు, జీలకర్ర లాంటి పదార్థాలు ఉంటాయి. ఈ ఎండల్లో చెమట ద్వారా కోల్పోయే ద్రవాలు, కొన్ని ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడంలో కూడా ఇది సహాయపడుతుంది. మరి మజ్జిగను తీసుకుంటే ఎ లాంటి లాభాలు కలుగుతాయి, ఎంత మోతాదులో తీసుకోవాలో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.




శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది

ప్రస్తుతం ఎండ, ఉక్కపోత కారణంగా శరీరం నుంచి ఎక్కువగా చెమట బయటకు వెళ్తుంది. దీంతో శరీరంలో నీరు తగ్గి డీహైడ్రేషన్‌కు దారితీయవచ్చు. ఇలాంటి సమయంలో మజ్జిగ మంచి హైడ్రేటింగ్ డ్రింక్‌గా సహాయపడుతుంది. మజ్జిగలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరానికి ద్రవాలను అందిస్తుంది. చెమట ద్వారా కోల్పోయే పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్లను తిరిగి అందించడంలో కూడా మజ్జిగ సహాయపడుతుంది. అందుకే ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు నీటితో పాటు మజ్జిగను కూడా తీసుకోవచ్చు.

జీర్ణక్రియకు మజ్జిగ మేలు

మజ్జిగ తయారయ్యేది పెరుగుతో కాబట్టి ఇందులో సహజమైన ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా సమతుల్యతకు సహాయపడతాయి. దీంతో జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ముఖ్యంగా దక్షిణ భారతీయ స్టైల్ మజ్జిగలో కరివేపాకు, అల్లం, ఇంగువ, జీలకర్ర వంటి పదార్థాలు కలుపుతారు. ఇవి కూడా జీర్ణక్రియ సక్రమంగా జరగేలా చేస్తాయి.

గుండెలో బ్లాకేజీ.. యాంజియోప్లాస్టీ అవసరమా?



గుండె ధమనిలో అడ్డంకి ఉన్నట్లు పరీక్షల్లో తేలితే, ప్రతి రోగికి తప్పనిసరిగా స్టెంట్ అమర్చల్సిందేనా? అనే ప్రశ్న కలుగుతుంది. అయితే దీనికి సమాధానం వెదికేందుకు ప్రయత్నించినప్పుడు మెడికల్ గైడ్‌లైన్స్, కార్డియాలజిస్టులు దీనికి 'కాదు' అనే సమాధానం చెబుతున్నారు. కొన్ని కేసుల్లో యాంజియోప్లాస్టీ ప్రాణాలను కాపాడుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే చాలా కేసుల్లో మందులు, జీవనశైలిలో మార్పులు, సరైన పర్యవేక్షణ సరిపోవచ్చని అంటున్నారు.

యాంజియోప్లాస్టీ ఏంటి?

యాంజియోప్లాస్టీ లేదా పీసీఐ (పెర్క్యుటేనియస్ కరోనరీ ఇంటర్వెన్షన్) అనేది గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ఇరుకైన లేదా మూసుకుపోయిన కరోనరీ ధమనిని తెరిచే ఒక ప్రక్రియ. దీనిలో.. మూసుకుపోయిన ప్రాంతాన్ని వెడల్పు చేసేందుకు ఒక పలుచటి ట్యూబ్ ద్వారా బెలూన్‌ను చొప్పిస్తారు. తరువాత ఆ ప్రాంతంలో "స్టెంట్" అని పిలిచే బాగా పలుచగా ఉండే జాలీలాంటి లోహపు గొట్టాన్ని అమరుస్తారు.

ఇది ఎప్పుడు ఉపయోగపడుతుంది?

గుండెపోటు సంభవించినప్పుడుయాంజియోప్లాస్టీ ప్రాణాలను కాపాడగలదు. ప్రాణం పోకుండా ఉండటానికి దీనిని తక్ష ణం చేయడం ముఖ్యం. గుండెపోటు సమయంలో, గుండె రక్తనాళాలలో ఒకటి అకస్మాత్తుగా పూర్తిగా మూసుకుపోతుంది. దీనివల్ల గుండె కండరానికి రక్త ప్రసరణ ఆగిపోతుంది. ఈ సమయంలో అడ్డంకిని తొలగించడానికి యాంజియోప్లాస్టీని వేగంగా చేస్తే: గుండె కండరాలకు కలిగే నష్టం తగ్గుతుంది. హార్ట్ ఫెయిల్ అయ్యే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రాణం పోయే ప్రమాదం కూడా తగ్గుతుంది. దీంతో, తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించే అవకాశం ఉన్న గుండెపోటుల విషయంలో వెంటనే యాంజియోప్లాస్టీ చేయాలని వైద్య మార్గదర్శకాలు నొక్కి చెబుతున్నాయి. "ఎవరైనా సీరియస్‌గా ప్రభావితమైతే, స్టెంట్‌ను కచ్చితంగా అమర్చాల్సిందే. వారు బతికే అవకాశాలను, అలాగే నొప్పితో సహా వారి లక్షణాల తీవ్రతను అంచనా వేస్తారు" అని ప్రభుత్వ వైద్యులు, కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ జస్టిన్ పాల్ అన్నారు.

గుండెపోటు సంకేతాలేంటి?

ఛాతీలో తీవ్రమైన ఒత్తిడి లేదా నొప్పి ఆ నొప్పి చేతికి, భుజానికి, వెన్నుకు లేదా దవడకు వ్యాపించడం ఊపిరి ఆడకపోవడం ఎక్కువగా చెమటలు పట్టడం కళ్లు తిరగడం లేదా వాంతులు

మందులు సరిపోతాయా?

చాలా మందికి గుండెపోటు రాదు. కానీ, వారికి 'స్టేబుల్ కరోనరీ ఆర్టెరీ డిసీజ్' లేదా 'స్టేబుల్ యాంజినా' ఉండి ఉంటుంది. అటువంటి రోగులకు:

ఛాతీ నొప్పి కొన్ని పరిస్థితులలో మాత్రమే వస్తుంది. వ్యాయామం లేదా నడక సమయంలో వచ్చే నొప్పి, విశ్రాంతితో తగ్గుతుంది. ఈ పరిస్థితి తక్షణ ప్రాణాపాయం కలిగించేది కాదు. వీటికి సాధారణంగా ప్రాథమిక చికిత్సగా ఈ కింది వాటిని సిఫార్సు చేస్తారు

కొలెస్ట్రాల్ నియంత్రించే మందులు

ఆస్పిరిన్ లేదా రక్తాన్ని పలచబరిచే ఇతర మందులు

రక్తపోటు నియంత్రణ

మధుమేహ నియంత్రణ

ధూమపానం మానేయడం

వ్యాయామం, ఆహారపు అలవాట్లలో మార్పులు

చాలా సందర్భాలలో, ఇవే వ్యాధి నియంత్రణకు సరిపోతాయని వైద్యులు చెప్పారు.

స్టెంట్ అవసరం ఎప్పుడు?

మందులు వాడినప్పటికీ లక్షణాలు కొనసాగితే, లేదా గుండెకు రక్త ప్రసరణ బాగా దెబ్బతిన్నట్లు పరీక్షలలో తేలితే, యాంజియోప్లాస్టీని పరిగణించొచ్చు. కేవలం బ్లాకేజీ ఏర్పడిన మాత్రాన స్టెంట్ ఎందుకు అవసరం లేదు? ఎవరికైనా బ్లాకేజీ ఏర్పడిన మాత్రాన స్టెంట్‌ను అమర్చాల్సిన అవసరం లేదని జస్టిల్ పాల్ అన్నారు. యాంజియోగ్రామ్‌లో రక్తనాళంలో అడ్డంకి ఉన్నట్లు తేలినా కూడా, డాక్టర్ ఈ కింది వాటిని చెక్ చేస్తారు.

ఆ బ్లాకేజీ ఎంత ప్రమాదకరంగా ఉంది?

రక్త ప్రసరణను ఇది నిజంగా ప్రభావితం చేస్తుందా?

గుండె కండరాలకు ఆక్సిజన్ తక్కువగా అందిస్తోందా

'ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాకే స్టెంట్ అవసరమో కాదో నిర్ణయించగలం. స్టెంట్ అమర్చే ముందే.. బ్లాకేజీ ఉన్న ప్రదేశం, ప్రభావిత ప్రాంతంలో ఎంత కీలకమైన కండరం ఉంది, స్టెంట్ అమర్చడం వల్ల నిజంగా రోగికి ప్రయోజనం కలుగుతుందా లేదా అనే విషయాలను తెలుసుకోవాలి' అని డాక్టర్లు చెప్తున్నారు.

ఎంత బ్లాకేజీ ఉంటే స్టంట్ వేస్తారు?

అలాగే, '70 శాతం బ్లాకేజీ ఉంటే స్టెంట్ తప్పనిసరిగా వేయాలి' అనేది నిజమేనా అని అడిగినప్పుడు, వైద్యులు 'కాదు' అని చెప్పారు. యాంజియోగ్రామ్‌లో కేవలం '70 శాతం బ్లాకేజీ' లేదా '80 శాతం బ్లాకేజీ' ఉందని తెలిసినప్పుడు, చికిత్స విషయంలో నిర్ణయం తీసుకోవడానికి అదొక్కటే సరిపోదని గుండె వైద్యులు చెప్పారు.

దీనికి భిన్నంగా వైద్యులు..

రోగి లక్షణాలను

ఫిట్‌నెస్ టెస్టు ఫలితాలను

రక్త ప్రసరణ అంచనాలను

మొత్తం గుండెకు సంబంధించిన ప్రమాద స్థాయిలను పరిశీలిస్తారు.

'ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను వెంటనే పరిష్కరించాల్సినట్లే, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన ధమనులలో అడ్డంకి ఏర్పడితే, రోగి పరిస్థితిని బట్టి స్టెంట్ అమర్చడం అవసరం. కానీ, బ్లాకేజీ రక్తనాళాల చివరి భాగాలలో లేదా ప్రధాన ధమనులు కాకుండా ఇతర రక్తనాళాలలో ఉంటే, స్టెంట్ అవసరం ఉండదు. వీటిని మందులతో తగ్గించవచ్చు' అని వైద్యులు తెలిపారు. ఒక వేళ బ్లాకేజీ 60 శాతం లేదా 70 శాతానికి పైగా ఉంటే.. వైద్యులు స్టెంట్ వేయడాన్ని సూచిస్తుంటారు.

'60 శాతం లేదా 70 శాతం బ్లాకేజీ ఉంటే.. పరిస్థితి అకస్మాత్తుగా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు, వైద్యులు స్టెంట్ సూచిస్తారు.'

'కొంత మందికి చిన్న అడ్డంకి ఉంటుంది. కానీ, ట్రెడ్‌మిల్ పరీక్షలో తీవ్రమైన కండరాల నష్టం బయటపడవచ్చు. కాబట్టి, అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, స్టెంట్ అమరుస్తారు' అని ఆయన చెప్పారు. కేరళలో జరిగిన చర్చ సందర్భంగా, అనవసరమైన వైద్య విధానాలను నివారించాలని భారతీయ వైద్య సంఘం (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) కూడా అంగీకరించింది. అయితే, ప్రాణరక్షణ పరిస్థితులలో కూడా యాంజియోప్లాస్టీ అనవసరం అనే అపోహను వ్యాప్తి చేయవద్దని హెచ్చరించింది. అటువంటి అపోహ గుండెపోటు రోగులకు చికిత్స ఆలస్యం కావడానికి దారితీయవచ్చని భారతీయ వైద్య సంఘం పేర్కొంది.

అత్యవసరం కాకపోతే ఏం చేయాలి?

అత్యవసర పరిస్థితి కాకపోతే.. వైద్యుడిని రోగి లేదా కుటుంబం ఈ కింద ప్రశ్నలను అడగవచ్చు.. నాకు ఇప్పుడు గుండెపోటు వస్తుందా? ఇది అత్యవసర చికిత్సా లేక ప్రణాళికాబద్ధమైన చికిత్సా? బ్లాకేజీ ఎంత తీవ్రంగా ఉంది? ఇది నిజంగా రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుందా? ముందుగా మందులు వాడి చూడొచ్చా? స్టెంట్ అమర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి?

సెకండ్ ఒపీనియన్ తీసుకుందామా?

పగను శ్వాసిస్తున్నారా!

ప్రేమ పగ ఈ రెండూ పక్క పక్కనే ఉంటాయి. అయితే ప్రేమ అందరిదీ అయి తే పగ కొందరిది మాత్రమే. ప్రేమ ఉన్న చోట పగకు స్థానం లేదు, పగ అన్న దానికి ఉనికి వెన్నెల వెలుగు లాంటి చల్లని ప్రేమ తాకనంతవరకే. అది చేరాక చీకటిలా పగ కూడా పరుగు తీయాల్సిందే. అయితే ప్రేమ అంతటా పరచుకునేలా చేసే పని ఎవరిది అన్నదే మౌలికమైన ప్రశ్న. ప్రేమతో దేనిని అయినా జయించవచ్చు అన్న సూత్రాన్ని తెలియచెప్పడంలో సమాజంలో తడబాటు పొరపాటు ఎక్కడ జరుగుతోంది అన్నది మరో ప్రశ్న. ప్రేమ తగ్గిన చోట తాటకిలా పగ కచ్చితంగా మొలుస్తుంది, అదే గెలిచినట్లుగా వికటాట్టహాసం కూడా చేస్తుంది.

ఐచ్చిక మరణంగా

మహా భారతంలో భీష్ముడికి మాత్రమే ఐచ్చిక మరణం ఉండేది. ఆయన తాను ఎపుడు కోరుకుంటే అపుడు మరణించే వరాన్ని పొందిన ఏకైక యోధుడు. అందుకే ఆయనను బాణాలు వేసి అర్జునుడు నేల కూల్చిన ప్రాణాలను మాత్రం తీయలేకపోయాడు. అయితే భీష్ముడి వరం కంటే కూడా గొప్పగా ఇపుడు కలియుగంలో ఆధునిక జీవనంలో తెలివైన వారు అంతా ఐచ్చిక మరణాన్ని ఆశ్రయిస్తున్నారు. అదే ఆత్మహత్య. తాము ఎపుడు కోరుకుంటే అపుడు చనిపోవడం. దానికి ముందు ఎన్ని తప్పులు చేయాలో అన్నీ చేసేసి మరీ తాము కూడా తనువు చాలించడం. ఇది ఒక వికృత క్రీడ. తాను చస్తూ అనేక మందిని చంపడం పగ ప్రతీకారంతో శ్వాసించి అందులోనే తుది శ్వాస విడవడం.

సైకో రాజ్ కుమార్ మిగిల్చినది

ఇక ఇదంతా ఎందుకు అంటే తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ లోని ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు అయిన రాజ్ కుమార్ సోమవారం తన మేనమామ ఊళ్ళో ఆత్మహత్య చేసుకుని ఐచ్చిక మరణం పొందాడు అన్న మాట. దాంతో సభ్య సమాజం మొత్తానికి అతగాడు అంతులేని అసంతృప్తి మిగిల్చాడు. ఇంతలా పసి గొంతులతో పాటు వృద్ధుల ప్రాణాలు తీసి మరీ నర మేధం చేసిన రాజ్ కుమార్ ని పట్టి బంధించి నలుగురి మధ్యన ఉరి తీయాలని పౌర సమాజం డిమాండ్ చేసింది. అలాగే ఆశించింది. కానీ అందరి కోపాన్ని అలాగే ఉంచేస్తూ రాజ్ కుమార్ తన చావు తానే కోరి తెచ్చుకున్నాడు, అలా ప్రశాంతంగా వెళ్ళిపోయాడు అని సమాజం గోడుమనడమే మిగిలింది.

తప్పెవరిది అని అంటే


ఈ ఎపిసోడ్ లో సైకో రాజ్ కుమార్ తాను ఆరుగురిని చంపాడు, తానూ తనువు చాలించాడు. మొత్తానికి తాను అనుకున్నది చేశాడు. గెలిచాను అనుకుంటూనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక విధంగా సమాజానికి సవాల్ చేసి జవాబు లేని ప్రశ్నలు ఎన్నో రేకెత్తించి మరీ లోకం వదిలాడు. ఈ మొత్తం ఎపిసోడ్ లో తప్పు ఎవరిది అంటే వారూ వీరూ అని ఎవరినో అనుకుంటారు, కానీ మొత్తానికి బాధ్యత స్వీకరించాల్సింది పౌర సమాజం మాత్రమే అన్నది అసలైన జవాబు. ఏ సమాజంలో అయితే నైతిక నిష్ట ఉంటుందో ఎక్కడైతే మోరల్ పోలీసింగ్ సజావుగా సాగుతుందో అక్కడ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడానికి అస్కారం ఉండదు, సైకో రాజ్ కుమార్ గుండె నిండా పగ నింపుకుని అందరి మధ్యనే మానవ మృగంగా తిరిగాడు. అతను చేసే తప్పులు అన్నీ ఇన్నీ కావు, టీనేజ్ నుంచే జులాయి వేషాలు వేసాడు అని పోలీసుల దర్యాప్తులో తేలిన విషయం. మరి అతగాడిని ఆదిలోనే అదుపు చేయాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులతో పాటు సమాజం మీద కూడా ఉంది కదా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

నైతికత లేకపోతేనే ముప్పు

ఏ సమాజంలో అయితే నైతికత దెబ్బ తింటుందో అక్కడే అసలైన ముప్పు పొంచి ఉంటుందని మేధావులు చెబుతారు. ఎన్ని చట్టాలు ఉన్నా సమాజం నుంచి నేర్చేదే ఎక్కువగా ఉంటుంది. ఏమి చేసినా చెల్లుతుంది అనే ధోరణి నుంచే సైకోలు పుడతారు, వారిని మొగ్గలోనే అదుపు చేసి అణచివేసే చర్యలు సమాజం కూడా తీసుకోవాలి. విద్యార్థి దశ నుంచి అది బలంగా చేరాల్సి ఉంది. పాఠశాల విద్య నేర్పే గురువుల నుంచి తోటి స్నేహితుల నుంచి అలాగే ఇరుగుపొరుగు నుంచి ఇంకా సమాజంలో వివిధ వర్గాల నుంచి ఈ తరహా సైకో ప్రవర్తనను కట్టడి చేసే మెకానిజం అన్నది ఎక్కడో దెబ్బ తినడం వల్ల మూడున్నర దశాబ్దాల తన సైకో ప్రవృత్తితో పగనే మొత్తంగా చేసుకుని రాజ్ కుమార్ లాంటి వారు జీవిస్తున్నారు, మరణిస్తూ కూడా తామే గెలిచామని భ్రమిస్తున్నారు.

తనను తాను తడుముకోవాలి

ఈ తరహా సంఘటనలు జరిగిన ప్రతీ సారీ మోరల్ పోలీసింగ్ బాధ్యత తెలియచేస్తుంది. అలాగే సమాజంలో నైతిక ప్రమాణాలను మరింత బలంగా పాదుగొల్పాల్సిన అవసరాన్ని కూడా నొక్కి చెబుతోంది. కురు సభలో ద్రౌపది వలువలు దుశ్శాసనుడు ఒలిచినపుడు ప్రధాని విలన్ గా అతడే కనిపిస్తాడు, కానీ మంచి చెడూ చెప్పలేని కురు వృద్ధులు కురు వృద్ధ బాంధవులు అంతా కూడా దానికి బాధ్యత వహించిన వారే అవుతారు. అలాగే మన మధ్యనే సైకో విష సర్పాలు పెరుగుతున్నాయంటే సమాజం ఒక్కసారి తనను తాను తడుముకోవాల్సిన అవసరం ఉంది. ఉత్తమ విలువలకు పట్టం కట్టే దిశగా అడుగులు బలంగా వేయాల్సిన అవసరం ఉంది, పగ కాదు ప్రేమతోనే జీవితం అని చెప్పాల్సిన అవసరం ఎంతో ఉంది. లేకపోతే సైకోలే చచ్చి గెలుస్తారు, బతికి చంపుతారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 23.10.2026
www.mudranews.in | @mudranews

రక్తంలో చక్కెర నియంత్రణకు కొంత మేలు



కొన్ని పరిశోధనల్లో అల్లం తీసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలపై స్వల్ప ప్రయోజనం ఉండవచ్చని తేలింది. అయితే దీనిపై మరింత పరిశోధన అవసరం. మధుమేహ మందులకు బదులుగా అల్లాన్ని ఉపయోగించకూడదు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి

డిజిపి కార్యాలయంలో..

ముద్ర, హైదరాబాద్, అక్టోబరు 22: గురువారం డిజిపి కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేదలు, బలహీన వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ,తెలంగాణ చరిత్రలో ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో మల్టీజోన్– II ఐజీ షానవాజ్ ఖాసిం, ఏఐజి అడ్మిన్ జె. అన్యోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణలో వచ్చేది బీసీ రాజ్యమే

ముద్ర, హైదరాబాద్: మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ, మెజారిటీ ప్రజలకు రాజ్యాధికారం దక్కే లక్ష్యంతో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి జాజుల పూలమాల వేసి నివాళులర్పించారు.వందల ఏళ్ల క్రితమే సర్వాయి పాపన్న, పండుగ సాయన్న, చాకలి ఐలమ్మ, కొమురం భీం, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి బహుజన మహనీయులు ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్యానికి పునాదులు వేశారని జాజుల పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతంలో జన్మించిన పండుగ సాయన్న పేదల కష్టాలు తీర్చేందుకు, ఆధిపత్య దొరలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని కొనియాడారు.ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటూ ఇతర బీసీ వర్గాలతో కలిసి ఉద్యమించాలని, అప్పుడే పండుగ సాయన్న ఆశయాలు నెరవేరుతాయని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కుర్మా, పిట్ల శ్రీధర్, బి. మణి మంజరి, శివకుమార్, సంధ్యారాణి, వరుణ్ కుమార్, గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ చెరువు పనుల పరిశీలన



ముద్ర, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ కుడికుంట చెరువు అలుగు నుండి మసీదు బండ ప్రభుపాద లే ఔట్ కాలనీ వరకు రూ. 4 కోట్ల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం పనులను పరిశీలించిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మసీదు బండ లోని ప్రభు పాద లే ఔట్ కాలనీ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, సుమారుగా నాలుగు కోట్ల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్ గాంధీ తెలియచేశారు. వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపునకు గురి అవుతుందన్నారు.కుడి కుంట చెరువు ఔట్ లెట్ నుండి నీటి ప్రవాహం అధిక మొత్తంలో వస్తుంది కావున చెరువు ఔట్ లెట్ ను పరిగణలోకి తీసుకోవాలని, మళ్ళీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని, గాంధీ తెలియచేశారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

ముద్ర, మల్కాజిగిరి: మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్. రామారావు అధ్యక్షతన రైల్ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల సంఘాలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల కోసం మరుగుదొడ్ల సౌకర్యాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ అలీ కోరారు. రెండేళ్లుగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మల్కాజిగిరి స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని, ఎంఎంటీఎస్, సిద్ధిపేట రైళ్ల సమయాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న స్టేషన్ అభివృద్ధి పనులపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, వీరభద్రరావు, సీసీఐ ఇంతియాజ్ అహ్మద్, వాసంశెట్టి శ్రీనివాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో దసరా జోష్..

మద్యం అమ్మకాలు రూ.653 కోట్లు
మూడు రోజుల్లో భారీగా విక్రయాలు

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో దసరా పండుగ సందర్భంగా మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. సద్దుల బతుకమ్మ, మరుసటి రోజు, దసరా పండుగ రోజు కలిపి మూడు రోజుల్లో సుమారు రూ.653 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు సమాచారం. అక్టోబర్ 19 నాటికే రాష్ట్రవ్యాప్తంగా వైన్‌షాపుల యజమానులు డిపోల నుంచి రికార్డు స్థాయిలో రూ.2,054.51 కోట్ల విలువైన మద్యాన్ని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పండుగ నేపథ్యంలో మద్యం కొనుగోళ్లు భారీగా పెరిగాయని, గతేడాదితో పోలిస్తే ఈసారి విక్రయాలు 20 శాతం వరకు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే, డిపోల నుంచి మద్యం సరఫరా విలువకు, వినియోగదారులకు జరిగిన వాస్తవ విక్రయాలకు తేడా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులకు ప్రత్యేక శిక్షణ

ఐఏఎస్ఓ-నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ మధ్య అవగాహన ఒప్పందం



ముద్ర, హైదరాబాద్: దేశంలో క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు యువ వైద్యులకు ప్రత్యేక శిక్షణ, ఫెలోషిప్ అవకాశాలను విస్తరించేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ (ఐఏఎస్ఓ), నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేష్ ప్రతిపాదించిన ఈ కార్యక్రమాన్ని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, ఐఏఎస్ఓ అధ్యక్షుడు డాక్టర్ టి. సుబ్రహ్మణ్యేశ్వరరావు ముందుకు తీసుకెళ్తున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక తలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఒప్పందంలో భాగంగా రోబోటిక్ శస్త్రచికిత్సలు, కనిష్ఠ కోతలతో చేసే శస్త్రచికిత్సలు, ఆధునిక వైద్య విధానాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫెలోషిప్‌లు, వర్క్‌షాప్‌లు, సదస్సులు, సంయుక్త పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నరేంద్ర హులిక

7,800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ కొనుగోలుకు టెండర్లు

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఇంధన నిల్వ సామర్థ్యాలను పెంచేందుకు టీజీ రెడ్కో, టీజీ జెన్‌కో సంస్థలు మొత్తం 7,800 మెగావాట్ల సామర్థ్యానికి విద్యుత్ కొనుగోలు టెండర్లు జారీ చేశాయి. వీటిపై గురువారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో ప్రీ–బిడ్ సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 120 మంది, ప్రత్యక్షంగా 70 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.టీజీ రెడ్కో ద్వారా 2,000 మెగావాట్ల ఎఫ్‌డీఆర్ఈ విద్యుత్, 3,000 మెగావాట్ల సౌర విద్యుత్‌తో పాటు 1,000 మెగావాట్ల బ్యాటరీ నిల్వ వ్యవస్థ, 800 మెగావాట్ల పవన విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచారు. టీజీ జెన్‌కో ఆధ్వర్యంలో మరో 2,000 మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థ ఏర్పాటుకు టెండర్లు జారీ చేశారు.సమావేశంలో బిడ్డర్లు లేవనెత్తిన సాంకేతిక, టెండర్ నిబంధనలపై అధికారులు వివరణలు ఇచ్చారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత పాటిస్తామని హామీ ఇచ్చారు. టీజీ రెడ్కో వైస్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ, టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బిడ్డర్లు తమ సందేహాలు, సూచనలను ఇమెయిల్ ద్వారా పంపించాలని కోరారు.ల్, డాక్టర్ చంద్ర మోహన్, డాక్టర్ సుబ్బయ్య షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రావెల్స్ బస్సులు సీజ్



ముద్ర కూకట్‌పల్లి : రవాణా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రవాణా శాఖ (ఆర్‌టీఓ) అధికారులు గురువారం జే ఎన్ టీ యు లో సీజ్ చేశారు. ఈ బస్సుల్లో ప్రయాణికుల భద్రతకు సంబంధించిన పలు లోపాలతో పాటు పన్ను ఎగవేత కూడా జరిగినట్లు అధికారులు గుర్తించారు. అధికారి అన్న పూర్ణ సమాచారం మేరకు, ఆర్‌టీఓ అధికారుల తనిఖీల్లో ఈ క్రింది ప్రధాన ఉల్లంఘనలను అధికారులు గమనించారు: భద్రతా పరికరాల లోప్రథమ చికిత్స (మెడికల్) కిట్లు అందుబాటులో లేకపోవడం మరియు అగ్నిమాపక యంత్రాలు (ఫైర్ ఎక్స్‌టింగ ిషర్లు) పనిచేయని స్థితిలో ఉండటం. బస్సు డ్రైవర్లు నిబంధనల ప్రకారం కేటాయించిన యూనిఫాం ధరించకపోవడం.ప్రయాణికుల బస్సుల్లో సజీవ కోళ్ళను రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసి కూడా వాటిని తరలించడం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రవాణా పన్నును సకాలంలో చెల్లించకపోవడం. ఈ ఉల్లంఘనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, మోటారు వాహనాల చట్టం కింద రెండు బస్సులను సీజ్ చేసినట్లు అసిస్టెంట్ ఆర్‌టీఓ అన్నపూర్ణ మీడియాకు వెల్లడించారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే వాహనాలపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ప్రయాణికులు కూడా సురక్షితమైన ప్రయాణం కోసం వాహనాల స్థితిగతులను గమనించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం



ముద్ర కూకట్‌పల్లి : రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామం, పట్టణం, డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, పట్టభద్ర ఓటర్లతో మమేకమై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను చంపి.. మృతదేహాన్ని కాలువలో పడేసిన భర్త



ముద్ర, బెంగళూరు: ఒక వ్యక్తి అనుమానంతో తన భార్యను హత్య చేశాడు. చోరీ చేసిన బైక్‌పై మృతదేహాన్ని తరలించి ఒక కాలువలో పడేశాడు. మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడైన ఆమె భర్తను అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన 25 ఏళ్ల రుక్సానా మొదటి భర్త నుంచి విడిపోయింది. ఒక బిడ్డ ఉన్న ఆమె బెలూన్లు అమ్మే సమయంలో అదే రాష్ట్రానికి చెందిన 22 ఏళ్ల మహమ్మద్ ఇర్ఫాజ్ పరిచయమయ్యాడు. ప్రేమించుకున్న వీరిద్దరూ ఏడాది కిందట పెళ్లి చేసుకున్నారు. ఆరు నెలల కిందట కర్ణాటక రాజధాని బెంగళూరు చేరుకున్నారు. ఇర్ఫాజ్ ఒక క్లాత్ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా రుక్సానా కూడా ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నది. కాగా, రుక్సానా తరచుగా ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడటంతో మరో వ్యక్తితో ఆమెకు సంబంధం ఉన్నట్లు ఇర్ఫాజ్ అనుమానించాడు. దీంతో ఈ జంట మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అక్టోబర్ 10న ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో రుక్సానాను రాయితో కొట్టి ఇర్ఫాజ్ హత్య చేశాడు. ఆమె నోటిలో గుడ్డలు కుక్కాడు. భార్య మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో చుట్టాడు. చోరీ చేసిన బైక్‌పై ఆమె మృతదేహాన్ని తరలించాడు. గోపాలపుర ప్రాంతంలోని మురుగు కాలువలో బైక్‌తో సహా మృతదేహాన్ని పడేశాడు. మరోవైపు అక్టోబర్ 13న ఆ మురుగు కాలువలో మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ మహిళ హత్యపై దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆమె ఎవరన్నది గుర్తించేందుకు గోపాలపుర ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. చివరకు ఇర్ఫాజ్ భార్య రుక్సానా అదృశ్యమైనట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీంతో అతడ్ని ప్రశ్నించారు. అయితే తన భార్య బీహార్‌లోని స్వగ్రామానికి వెళ్లినట్లు ఇర్ఫాజ్ తెలిపాడు. ఆమె మొబైల్ ఫోన్ వాడటం లేదని చెప్పాడు. మరింతగా దర్యాప్తు చేసిన పోలీసులు ఇర్ఫాజ్‌ను అనుమానించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. భార్యను హత్య చేసినట్లు ఇర్ఫాజ్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మానవ అండాల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

ఈడీ దాడుల్లో భారీగా నగదు, ఆస్తులు సీజ్

ముద్ర, ముంబై: మానవ అండాలు అక్రమ రవాణా చేస్తున్న ముఠాపై ముంబైకి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు చేశారు. భారీగా నగదు, బ్యాంకు లాకర్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు సహా కీలక ఆధారాల్ని అధికారులు సీజ్ చేశారు. మంజూషా వాంఖెడేకు సంబంధించి లభ్యమైన ఆధారాలను బట్టి మానవ అండాల అక్రమ రవాణా ముఠా గుట్టును ఈడీ ముంబై జోనల్ ఆఫీస్ అధికారులు చేధించారు. ఈ అక్రమ రవాణాలో మొత్తం 17 మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. దీనిలో భాగంగా అక్టోబర్ 16 నుంచి పది వేర్వేరు చోట్ల సోదాలు నిర్వహించారు. థానే, నాసిక్, బరామతితోపాటు ఇతర చోట్ల దాడి చేశారు. థానేలోని బద్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈ కేసును విచారిస్తున్నారు. మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ)–2002 కింద ఈ కేసు నమోదైంది. పలు ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్లలో సోదాలు జరిపారు. నిందితులు, వారి స్థావరాల నుంచి రూ.29 లక్షల నగదు, బ్యాంకు అకౌంట్లు, ఇతర డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాల్ని సీజ్ చేశారు.ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఈ నెట్‌వర్క్ సభ్యులు పేద మహిళల్ని లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. వారికి కొంత నగదు ఇచ్చి, వారి అండాలను సేకరిస్తున్నారు. అనంతరం వాటిని ఐవీఎఫ్ సెంటర్లు, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) బ్యాంకులకు విక్రయిస్తున్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరం. అలాగే, తప్పుడు ధృవపత్రాలతో దాతల వివరాలు నమోదు చేస్తున్నారు. ఒకసారి డొనేట్ చేసిన మహిళల నుంచే వరుసగా అండాల్ని సేకరిస్తూ, వేరే పేర్లతో విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 40 మందికి పైగా మహిళల నుంచి ఇలా అండాల్ని సేకరించారు. ఒక్కో సైకిల్‌కు రూ.25,000 నుంచి రూ.30,000 వరకు మహిళలకు అందిస్తున్నారు. అలాగే, అండాలు విడుదలయ్యేందుకు వారికి హార్మోనల్ ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు బయటపడింది. దీంతో ఈడీ రంగంలోకి దిగి విచారణ జరుపుతోంది.

దసరా ఊరేగింపులో ఏనుగు బీభత్సం

పరుగులు తీసిన జనం

ముద్ర, బెంగళూరు: దసరా సందర్భంగా ఏనుగుపై దేవుడిని ఊరేగించేందుకు ప్రయత్నించారు. అయితే సుమారు 650 కిలోల బరువున్న వెండి మండపాన్ని ఆ ఏనుగుపై ఉంచారు. ఈ నేపథ్యంలో అది పరుగులు తీసి బీభత్సం సృష్టించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని శివమొగ్గలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం దసరా సందర్భంగా ఒక ఏనుగుపై దేవుడిని ఊరేగించేందుకు సిద్ధం చేస్తున్నారు. సుమారు 650 కిలోల బరువైన వెండి మండపాన్ని అంబారీపై ఉంచారు. కాగా, ఆ ఏనుగు అదుపుతప్పింది. ఒక్కసారిగా పరుగులు తీసింది. అక్కడ బీభత్సం సృష్టించింది. పలు ఇళ్లు, వాహనాలను అది ధ్వంసం చేసింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. రోడ్లపై ఉన్న జనంతో పాటు పోలీసులు కూడా పరుగులు తీశారు. మరోవైపు సోమన్నగా పిలిచే ఆ ఏనుగును అదుపు చేసేందుకు పశువైద్యులు ప్రయత్నించారు. చివరకు దానికి మత్తు మందు ఇచ్చారు. దీంతో ఆ ఏనుగు నియంత్రణలోకి వచ్చింది. శివమొగ్గ జిల్లా ఎస్పీ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని పర్యవేక్షించారు. అయితే ఏనుగు బీభత్సం సృష్టించిన ఈ



వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 23.10.2026
www.mudranews.in | @mudranews

యాంటీఆక్సిడెంట్లతో శరీరానికి రక్షణ



అల్లంలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగిన పదార్థాలు ఉంటాయి. ఇవి కణాలకు హాని కలిగించే ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో సహాయపడవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా అల్లాన్ని చేర్చుకోవడం మంచిదే కానీ, ఇది అన్ని వ్యాధులను నివారిస్తుందని భావించకూడదు.

శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి



ముద్ర, ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని స్థానిక బస్ స్టేషన్ ఆధునికీకరణ పనులకు ఈనెల 25న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నారు. నేపథ్యంలో శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రోడ్డు రవాణా సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ లో చేపట్టనున్న ఆధునికీకరణ పనులు, శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఏర్పాట్లను సమన్వయంతో చేయాలని అధికారులకు మంత్రి సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ముద్ర, ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మన్ ఖాన్‌పేటకు చెందిన జివ్వాజి రాధాకృష్ణ(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం రాత్రి మిత్రులతో కలిసి సమీపంలోని పెద్దాపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వస్తుండగా వీరిద్దరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో రాధాకృష్ణతోపాటు మరో యువకుడు సాయిచరణ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే రాధాకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. రాధాకృష్ణ మృతితో ఆయన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

హైదరాబాద్‌లో భారీ సైబర్ దోపిడీ..

కేవలం 87 నిమిషాల్లో రూ. 3.34 కోట్లు లూటీ..

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ సైబర్ దోపిడీ వెలుగు చూసింది. రాయదుర్గంలోని ఒక ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (NBFC) సిస్టమ్‌లని లక్ష్యంగా చేసుకున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లు, అత్యంత చాకచక్యంగా కంపెనీ డిజిటల్ నెట్‌వర్క్‌లోకి చొరబడ్డారు. ఉదయం 10:31 గంటల నుంచి 11:58 గంటల మధ్య కేవలం 87 నిమిషాల వ్యవధిలోనే రూ. 3.34 కోట్ల నిధులను అక్రమంగా లూటీ చేశారు.

ఈ సైబర్ దాడిలో కేటుగాళ్లు సదరు సంస్థకు చెందిన బేగంపేట బ్రాంచ్ బ్యాంక్ ఖాతాను లక్ష్యంగా చేసుకున్నారు. అత్యాధునిక హ్యాకింగ్ మెళకువలను ఉపయోగించి, సంస్థ అంతర్గత సిస్టమ్‌లను హ్యాక్ చేసిన నేరగాళ్లు, కంపెనీ అనుమతి లేకుండానే నిధులను విదేశీ , స్వదేశీ నెట్‌వర్క్‌ల ద్వారా మళ్లించారు. కేవలం గంటన్నర సమయంలోనే ఏకంగా 183 విడతల్లో అత్యంత వేగంగా ఈ లావాదేవీలు పూర్తి చేసి, దేశవ్యాప్తంగా ఉన్న 52 వేర్వేరు ఖాతాల్లోకి మొత్తం రూ. 3.34 కోట్లను బదిలీ చేశారు.

సిస్టమ్‌లో అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ భారీ నిధుల మళ్లింపును గమనించిన కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన అందించిన ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఈ నిధులన్నీ బెంగళూరు, దిల్లీ, ముంబయి, ఉత్తరప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని బ్యాంకు ఖాతాలకు చేరినట్లు పోలీసులు గుర్తించారు. నిధులు మళ్లించిన ఈ 52 ఖాతాలన్నీ సైబర్ నేరగాళ్లు కమీషన్ల కోసం ఉపయోగించే 'మ్యూల్ ఖాతాలు' అయి ఉంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బు డిపాజిట్ అయిన వెంటనే ఇతర విదేశీ లేదా క్రిప్టో ఖాతాల్లోకి మార్చకుండా నిరోధించేందుకు, ఐపీ చిరునామాలు , బ్యాంక్ ట్రాన్సాక్షన్ ట్రాక్‌ల ఆధారంగా TGCSB పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తును వేగవంతం చేశారు.

జనవరి 1 నుంచి సిమ్ బైండింగ్‌రూల్స్..

ఆ ఫోన్లలో వాట్సప్ బంద్



ముద్ర, హైదరాబాద్ : వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్స్‌నకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయవన్నమాట. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లు రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించే లైవ్ సిమ్‌లతో ఖాతాలను అనుసంధానించాలని టెలికాం విభాగం (DoT) మార్గదర్శకాలు జారీ చేసింది. మొబైల్ నంబర్లను ఉపయోగించి చేసే సైబర్ నేరాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిబంధనలు కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి నుంచే ఈ రూల్స్‌ను అమలు చేయాల్సి ఉండగా.. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించింది.

సిమ్ బైండింగ్ నిబంధనల ప్రకారం.. సిమ్‌కార్డు లేకపోయిన లేదా సిమ్ తొలగించినా వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి కమ్యూనికేషన్ యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఎవరైనా సిమ్ లేకుండా వాట్సప్ వాడుతుంటే ఆ ఫోన్లలో కొత్త నిబంధనల ప్రకారం యాప్ సేవలు నిలిచిపోతాయి. ఒకే యాప్‌ను వేర్వేరు డివైజుల్లో వాడుతున్నప్పుడూ ప్రైమరీ డివైజులు కాకుండా మిగిలిన వాటిలో సేవలు నిలిచిపోతాయి. వాస్తవానికి వెబ్ లాగిన్‌ను ఆరు గంటలకోసారి లాగౌట్ అయ్యేలా తొలుత నిబంధన తెచ్చినప్పటికీ.. తర్వాత ఆ నిబంధనను తొలగించారు. రిస్క్ బేస్డ్ లాగౌట్ విధానాన్ని డాట్ తీసుకొచ్చింది.

కోట్లలో దసరా మద్యం అమ్మకాలు



ముద్ర, కరీంనగర్ : దసరా నేపథ్యంలో కిక్కు కోసం జిల్లా మద్యంప్రియులు రూ.33.7 కోట్ల ఖర్చు చేశారు. పండగకు వారం రోజుల వ్యవధిలో ఈ అమ్మకాలు జరిగినట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా 94 మద్యం దుకాణాల్లో 30,450 మద్యం, 60,750 బీరు పెట్టెలు అమ్ముడైనట్లు విశ్వసనీయ సమాచారం.

భారీ నిల్వలు ఖాళీ..

దసరా పండగలను దృష్టిలో ఉంచుకున్న మద్యం వ్యాపారులు ముందు జాగ్రత్తగా భారీగా మద్యం నిల్వలు సమకూర్చుకున్నారు. సాధారణ రోజులకంటే పండగ సమయంలో అమ్మకాలు పెరుగుతాయని ముందస్తు అంచనాతో మద్యం, బీరు పెట్టెలను పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచారు. దసరా రోజున మద్యం కొనుగోళ్లు ఒక్కసారిగా పెరగడంతో సాయంత్రం వరకు మద్యం నిల్వలు దాదాపు ఖాళీ అయ్యాయి. జిల్లాలోని మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి. మానకొండూరు, హుజూరాబాద్, కేశవపట్నం, గంగాధర తదితర ప్రాంతాల్లో మద్యం దుకాణాల్లో సాయంత్రం సమయానికి చల్ల బీర్ల కొరత ఏర్పడి మందుబాబులు బేజారయ్యారు. ఏదేమైనా బతుకమ్మ, దసరా పండుగ మద్యం వ్యాపారులకు కాసుల వర్షం కురిపించింది.

పుర ఎన్నికలు.. ఈసీ నిర్ణయంపై ఉత్కంఠ

ముద్ర, అమరావతి: ఏపీలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు మరికొన్ని గంటల్లో ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేశారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున, ఐజీ రాజకుమారితో సమీక్షలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇవ్వాల్సిన గడువు, ఇతరత్రా తేదీలపై వారితో చర్చించారు. మిగిలిన ఎన్నికల షెడ్యూల్‌కు ఆటంకం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అనిల్‌చంద్ర పునేఠా కసరత్తు చేశారు. అంశాలవారీగా ఎస్ఈసీ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. పలుచోట్ల నామినేషన్లు దాఖలు చేయనీయకుండా తమ అభ్యర్థులను అడ్డుకున్నారంటూ.. వైకాపా సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. 25వ తేదీ వరకు అభ్యర్థుల జాబితా ప్రకటన నిలిపివేసి.. ఫిర్యాదులపై గురువారం ఒక నిర్ణయం ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కృత్రిమ కరువు



ముద్ర, కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఘోర వైఫల్యం వల్లే తెలంగాణ రాష్ట్రంలో నేడు లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర అల్లాడుతోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై స్పందించారు. ఇది ప్రకృతో, కాలమో తెచ్చిన కరువు కాదని, కేవలం రేవంత్ రెడ్డి మార్క్ నిర్వహణా లోపం వల్ల సంభవించిన "కాంగ్రెస్ కృత్రిమ కరువు" అని దుయ్యబట్టారు.

ముందస్తు హెచ్చరికలు పట్టించుకోక మొద్దునిద్ర..

పది నెలల ముందే ఎల్ నినో ప్రభావంతో నీటి, విద్యుత్ ఇబ్బందులు ఎదురవుతాయని శాస్త్రవేత్తలు, నిపుణులు స్పష్టంగా హెచ్చరించినప్పటికీ ఈ ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా మొద్దునిద్ర పోయిందని హరీష్ రావు విమర్శించారు. సకాలంలో రివ్యూలు నిర్వహించకపోవడం వల్లే నేడు సాగు, తాగునీటికి పలు జిల్లాల్లో ప్రజలు, రైతులు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వేసిన పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పొలాల్లో కరెంట్ కోతలతో పంటలను కాపాడుకునేందుకు రైతులు మళ్లీ జనరేటర్లు, ఇన్వెర్టర్లు తేవాల్సిన దుస్థితి వచ్చిందని, కేసీఆర్ హయాంలో మాయమైన ఆ పాత రోజులను రేవంత్ ప్రభుత్వం మళ్లీ తిరిగితెచ్చిందని ఎద్దేవా చేశారు.

తప్పులు కప్పిపుచ్చుకోవడానికి అధికారులపై బెదిరింపులు

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే, రైతులు రోడ్లెక్కి సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి బీద అరుపులు అరుస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. "తన సొంత తప్పిదాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అధికారులపై చిందులు వేస్తూ, వారిని బెదిరిస్తున్నారు. అసలు సస్పెండ్ చేయాల్సింది అమాయక అధికారులను కాదు.. సీఎంను, విఫలమైన విద్యుత్ శాఖ మంత్రిని!" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించి రైతులకు ఎకరానికి పరిహారం అందిస్తుంటే.. ఇక్కడ రేవంత్ ప్రభుత్వం మాత్రం చేష్టలు ఉడుగి చూస్తోందని విమర్శించారు.

రాజకీయ కక్షతోనే మల్లన్న సాగర్, కాళేశ్వరం నీళ్లు బంద్

కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే రాజకీయ కక్షతోనే రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్‌ను నింపలేదని హరీష్ రావు సంచలన ఆరోపణ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కన్నెపల్లి వద్ద మోటార్లు ఆన్ చేయవచ్చని స్పష్టం చేసినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆరోపించారు. మల్లన్న సాగర్‌కు నీళ్లు ఎత్తిపోసి ఉంటే సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని, నీళ్లున్నా ఎత్తలేని చేతకానితనంతో ప్రభుత్వం కృత్రిమ కరువును సృష్టించిందని మండిపడ్డారు.

ఇప్పటికైనా కనీసం రాబోయే 20 రోజులైనా రైతాంగానికి నిరంతర, సరైన విద్యుత్ ఇస్తే ఊపిరి పీల్చుకుంటున్న మిగిలిన పంటలైనా పండుతాయని హరీష్ రావు సూచించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ తరపున ఆయన ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

ఖాకీలనే బురిడీ కొట్టించిన 'హనీ' కేటుగాడు

వలపు వలలో 1000 మందికి పైగా బాధితులు..



ముద్ర, హైదరాబాద్ : అందమైన అమ్మాయి ముసుగు.. తీయని మాటల వలపు వల.. తీరా ఆ ఊబిలో దిగాక అందినకాడికి బ్లాక్‌మెయిలింగ్! అమాయకులను బుట్టలో వేసే సైబర్ నేరగాడు ఏకంగా చట్టాన్ని కాపాడే పోలీసులనే టార్గెట్ చేసి నిలువునా ముంచేశాడు. ఒకరా ఇద్దరా.. ఏకంగా 82 మంది పోలీసు అధికారులను తన మాయాజాలంలో బంధించాడు. ఈ బాగోతంలో ఒక ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోల్పోయి ఊచలు లెక్కపెడుతుండగా, మరో ఏసీపీ విచారణను ఎదుర్కొంటున్నారు. సంచలనం సృష్టించిన ఈ అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ హనీట్రాప్ రాకెట్ గుట్టును హైదరాబాద్ సిటీ పోలీసులు రట్టు చేసి, ప్రధాన సూత్రధారి కొండబత్తుల పవన్‌కుమార్ రావును అరెస్ట్ చేశారు.

పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. పవన్‌కుమార్ తన మాజీ ప్రియురాలితో చేతులు కలిపి ఈ వలపు సామ్రాజ్యాన్ని నడిపాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో 33, ఫేస్‌బుక్‌లో 14 నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, అందమైన అమ్మాయిల ఫోటోలను డిస్‌ప్లేగా ఉంచాడు. ముఖ్యంగా పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపేవాడు. అవతలి వ్యక్తి స్పందించగానే శృంగార సంభాషణలు మొదలుపెట్టేవాడు.

వీడియో కాల్స్ మాట్లాడే సమయంలో బాధితుల ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేయడం, వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం చేసేవాడు. ఆ తర్వాత "మీ బాగోతాన్ని సోషల్ మీడియాలో పెడతాం.. డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసి ఉద్యోగం తీయిస్తాం" అంటూ బెదిరింపులకు దిగి లక్షల రూపాయలు వసూలు చేసేవాడు. చాట్ చేస్తున్నది అమ్మాయి కాదని తెలిసిన తర్వాత కూడా కొందరు అధికారులు అతనితో నిరంతరం చాటింగ్ సాగించడం గమనార్హం.

ఈ ఉచ్చులో అత్యంత దారుణంగా చిక్కుకున్న ఖైరతాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) బాలస్వామి ఉదంతం తీవ్ర కలకలం రేపింది. 'చందన' అనే నకిలీ పేరుతో సోషల్ మీడియా ఖాతా తెరిచిన పవన్.. ఆమె తన బంధువని, ఆమెతో పెళ్లి జరిపిస్తానని బాలస్వామిని నమ్మించాడు. అసలు చందన అనే వ్యక్తే లేనప్పటికీ.. ఆమెకు తీవ్ర అనారోగ్యంగా ఉందని నమ్మించి వైద్య ఖర్చుల పేరిట డీఐ నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గుంజాడు.

అంతటితో ఆగకుండా బాలస్వామిని భార్యాపిల్లల వద్దకు వెళ్లకుండా దాదాపు ఆరు నెలల పాటు ఓ లాడ్జిలోనే ఉంచి మానసికంగా వేధించాడు. ఇంటికి వెళితే అక్రమ కేసులు పెట్టి ఉద్యోగం ఊడేలా చేస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. బాధితుడి భార్య గంజి హరిత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు వ్యవహారం బయటపడింది. ప్రస్తుతం డీఐ బాలస్వామి ఈ సంబంధిత వివాదాల నేపథ్యంలో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్నారు.

నిందితుడు పవన్‌కుమార్ చేతిలో మోసపోయిన వారి సంఖ్య వెయ్యి దాటినట్లు పోలీసులు గుర్తించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో బాధితులు ఉన్నారు. ఈ నెట్‌వర్క్ సరిహద్దులు దాటి యూఏఈ, ఒమన్, పాకిస్థాన్, కెన్యా దేశాల వరకు విస్తరించడం అధికారులను సైతం నివ్వెరపరిచింది. మొత్తం బాధితుల్లో 82 మంది పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారే కావడం గమనార్హం. నిందితుడి బ్యాంక్ ఖాతాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు, ఈ దందాలో పవన్‌కు సహకరించిన కవితతో పాటు ఇతర ముఠా సభ్యుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 23.10.2026
www.mudranews.in | @mudranews

వాపు, నొప్పులను తగ్గించడంలో తోడ్పాటు



అల్లంలో జింజెరాల్ వంటి క్రియాశీల పదార్థాలు ఉంటాయి. వీటికి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, అల్లం తీసుకోవడం వల్ల మోకాళ్ల ఆస్టియో ఆర్థరైటిస్‌తో సంబంధం ఉన్న నొప్పి కొంత తగ్గవచ్చు. అయితే ఇది వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారు



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో పవిత్రోత్సవాల తొలిరోజు గురువారం శ్రీ స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహన సేవలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు గోవింద నామ స్మరణతో క్షేత్రాన్ని మార్మోగించారు. సూర్యప్రభ వాహనంపై విరాజిల్లిన శ్రీవారి దివ్య రూపం భక్తులకు కనులపండువగా నిలిచింది. సాయంత్రం శ్రీ స్వామివారికి పెద్దశేష వాహన సేవ నిర్వహించారు. ఆదిశేషుని వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

పండుగ సాయన్న సమాజ సేవ చిరస్మరణీయం

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు





రాంప్రభు, మామిడి వెంకటేశ్వర్లు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి దున్న శ్యాం తదితరులు పాల్గొన్నారు.



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : పండుగ సాయన్న సమాజంలోని పేదలు, బలహీన వర్గాల ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న సమాజంలోని పేదలు, బలహీన వర్గాల ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి, సమాజం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శ ప్రాయమని తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద..

భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ముదిరాజ్ సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సాయన్నకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు పెంట నరసింహ ముదిరాజ్, జిల్లా నాయకులు కొలుపుల హరినాథ్, కుక్కదువు సోమయ్య, సాదు విజయకుమార్, ఎనబోయిన ఆంజనేయులు, కొలుపుల అమరేందర్, గోరింకల శివశంకర్, ఇట్టబోయిన గోపాల్, ఈర్ల కృష్ణ, భువనగిరి పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, ప్రధాన కార్యదర్శి నీలం శ్రీనివాస్, నాయకులు బిస్కుంట్ల సత్యనారాయణ, మొలకల సత్యనారాయణ, గుర్రాల శ్రీనివాస్, తుమ్మల నాగేష్, జంగిటి వినోద్, ఉడత భాస్కర్ ,మాటూరి అశోక్, పిట్టల బాలరాజు, భగత్, శాగంటి నరసింహ, సిద్దెంకి కోటయ్య, పిట్టల రాములు, కస్తూరి పండు ఎనబోయిన సత్యనారాయణ, జిన్నా కృష్ణ భీమరి నరసింహ, గుర్రాల శివ, కనక బాల రాజు, గుర్రాల మల్లేష్, ఏలూరు భిక్షపతి, కొలుపుల నాగరాజు, ఎనబోయిన చంద్రశేఖర్, శివ, ఆవుల వినోద్, కాలభైరవ ముదిరాజ్ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 22: నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనియాడారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న ధనవంతులు, భూస్వాముల ఆధిపత్యాన్ని ఎదిరించి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని కలెక్టర్ పేర్కొన్నారు. నిజాం పాలకుల ధాన్యాగారాల నుంచి ధాన్యాన్ని సేకరించి పేదలకు పంచిపెట్టేవారని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటం ఆదర్శనీయమన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీవో శ్రీరామ్, బీసీ సంఘాల నాయకులు ఈదుల యాదగిరి, కళా కరుణాకర్, కందుల రమేష్, చలమల నరసింహ, బూర మల్సూర్ గౌడ్, పి. వీరాచారి, డాక్టర్ కృష్ణ బంటు, తన్నీరు

ఘనంగా పండుగ సాయన్న జయంతి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 22 : పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల హక్కుల కోసం వీరోచితంగా పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కొనియాడారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొరలకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాయన్న సాగించిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. కేవలం సంపన్నులన సంపదను పంచడమే కాకుండా, నాటి వ్యవస్థలను ఎదిరించి అణగారిన వర్గాలకు న్యాయం చేశారని తెలిపారు. ఇలాంటి మహనీయుల ధైర్యసాహసాలను భావి తరాలకు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో 60 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 22 : ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. మొత్తం 60 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ భర్తీ ప్రక్రియలో భాగంగా నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ ICU) – 2, కార్పెంటర్ – 1, బార్బర్ – 3, క్యాటలాగర్ (సెంట్రల్ రికార్డ్స్) – 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ – 20, ఎలక్ట్రీషియన్ – 3, ప్లంబర్ – 1, రికార్డు క్లర్క్ లేదా రికార్డు అసిస్టెంట్ – 1, రిఫ్రాక్షనిస్ట్ లేదా ఆప్టిషియన్ – 1, టైలర్ – 1, ధోబీ – 2, గ్యాస్ ఆపరేటర్ – 2, ల్యాబ్ అటెండెంట్ – 7, ఆఫీస్ సబార్డినేట్ – 8, ఎంఎన్ ఓ, ఎఫ్ ఎన్ ఓ – 2, అటెండెంట్ – 4, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్ – 1 పోస్టులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 31, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు ఆఫ్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. అభ్యర్థుల విద్యా అర్హతలు, నిబంధనలు, ఇతర పూర్తి సమాచారం కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://khammam.telangana.gov.in లేదా వైద్య కళాశాల వెబ్‌సైట్ https://gmckhammam.org లను సందర్శించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ కోరారు.


వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ దివాకర టి.ఎస్



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 22 : సమాజంలో అనాదిగా కొనసాగుతున్న వెట్టి చాకిరీ, బానిసత్వం వంటి దురాచారాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వెట్టి చాకిరీ నిర్మూలన అవగాహన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మిక హక్కులు, చట్టాలపై చైతన్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టి చాకిరీ అనేది మానవ హక్కులకు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని, సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందని స్పష్టం చేశారు. కార్మికులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా బలవంతంగా పనులు చేయించినా లేదా శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా వేధించినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు.ఈ ప్రచార కార్యక్రమం ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ముఖ్యంగా ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలు వంటి వెట్టి చాకిరీకి ఆస్కారం ఉన్న పని ప్రదేశాలపై ఈ ప్రచారం ప్రత్యేక దృష్టి సారిస్తుందని వివరించారు. సమాజంలో వెట్టి చాకిరీకి తావులేకుండా, ప్రతి కార్మికుడు స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించేలా చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం. కోటేశ్వరులు, జిల్లా సహాయ కార్మిక కమిషనర్ పి. కృష్ణవేణి, సహాయ కార్మిక అధికారి ఓ. రమేష్, యూనిట్ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రతినిధి భాస్కర్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, ఎఐడి ఎన్జీఓ శ్రీనివాస్, గజ్వేల్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ సాయిసన్నిధిలో ప్రవచనం



ముద్ర, దేవరకొండ: చింతపల్లి లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మహా సహస్రావధాని డాక్టర్ పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు "యోగ సమాధి" అంశంపై వారి అద్భుత ప్రవచనామృతాన్ని భక్తులకు అందించారు .జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులవారు రచించిన నిరంజనాష్టకం ఆధారంగా వారి ప్రవచనం అనర్గళంగా కొనసాగింది.మానవులు భక్తి మార్గంలో తమ మనసులను పరమాత్మునికి స్వాధీనం చేయాలని, మన మనస్సులను నిష్కల్మషంగా భగవంతుని సేవలో లీనం చేయడమే నిరంజన మార్గమనిఒక్కొక్క యుగంలో ఒక్కొక్క అవతారం ధరించిన పరమాత్ముడు ఈ కలియుగంలో శ్రీ షిరిడీ సాయినాథుని వంటి సద్గురువు అవతారంలో భక్తులను తరింపచేస్తున్నారు సర్వాంతర్యామి అయినప్పటికీ భగవంతుడు హోమాలు, యజ్ఞయాగాదులు జరిగే సాయిసన్నిధి వంటి పుణ్యక్షేత్రాలలోనే ప్రకటితమవుతారనమానవులు చెడు వ్యసనాలు మాని, తమ తమ కర్తవ్యాలను నిర్వహిస్తూనే భగవంతుణ్ణి స్మరించుకోవచ్చుని గరికిపాటి నరసింహారావు ఉపదేశించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ, కొమరిశెట్టి వెంకటయ్య, పుల్లారెడ్డి, తడక మల్ల శ్రీనివాసు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన



ముద్ర, దేవరకొండ: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వాసవీమాత విగ్రహం ఊరేగింపు గురువారం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతీ, యువకులు చేసిన కోలాట ప్రదర్శన, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నీల లక్ష్మయ్య, రాచమల్ల నర్సింహ, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ఊరె జనార్ధన్, ప్రధానకార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డి సుధాకర్, పీఏపల్లి మండలా ధ్యక్షుడు విడియాల రామయ్య, దుండిగళ్ళ వెంకటేశ్వర్లు, జిన్నం రాంమూర్తి, నీల శంకర్, కరుణాకర్, నీల విజయ్, విడియాల నరేందర్, మారం వెంకన్న పాల్గొన్నారు

ఇందిరమ్మ వివక్షపై భగ్గుమన్న విపక్షం

ఖమ్మంలో విపక్షాల భారీ ధర్నా



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 22 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర రాజకీయ వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ కలెక్టరేట్ వద్ద వామపక్షాలు, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎంఎల్సీ తాతా మధు అధ్యక్షతన ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై నిరసన తెలిపారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణమే రద్దు చేయాలని, పారదర్శకమైన లాటరీ పద్ధతి ద్వారానే అసలైన అర్హులను ఎంపిక చేయాలని వివిధ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ నిరసనను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించే ఇందిరమ్మ ఇండ్లు ప్రజల పన్నుల రూపంలో వచ్చే ప్రజాధనంతో కడుతున్నవే తప్ప, కాంగ్రెస్ నాయకుల సొంత ఖర్చు కాదని స్పష్టం చేశారు. మంత్రులు ఎంత చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి అధికారులను క్యాంపు కార్యాలయాలకు పిలిపించి కాంగ్రెస్ కార్యకర్తలకే ఇండ్లను కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇండ్లు ఇస్తామనడం సరికాదని, బోసకల్లు, కల్లూరు మండలం మర్లపాడు గ్రామాల్లో జరిగిన పరిణామాలే దీనికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణలను తుంగలో తొక్కి, గ్రామ సర్పంచులకు కనీస ప్రమేయం లేకుండా డిపార్ట్‌మెంట్ పరంగా ఎంపికలు జరపడాన్ని తప్పుబట్టారు. ధర్నా అనంతరం నాయకులు కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ను కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, బానోత్ చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, న్యూడెమోక్రసీ నాయకులు సి.వై. పుల్లయ్య, బండారు ఐలయ్య, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటుకున్న ముస్లింలు



ముద్ర, దేవరకొండ: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన దుర్గామాత ఊరేగింపులో పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు మంచినీటి సౌకర్యం కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. భారత్ ఫుట్‌వేర్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న హిందూ సోదరులకు మంచినీటిని అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. భిన్న మతాలు, విభిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో మతాలకు అతీతంగా మానవత్వమే గొప్పదని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.మతసామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని ఈ సేవా కార్యక్రమం చాటి చెప్పింది. ఇలాంటి కార్యక్రమాలు హిందూ, ముస్లిం సోదరుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు షకీల్, షంషోద్దీన్, బాబా భాయ్, ముస్తఫా, జకీ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజాసేవలో గోలి పింగల్ రెడ్డి



ముద్ర, బీబీనగర్: నిస్వార్థ ప్రజాసేవే లక్ష్యంగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి సేవా నిరతిని పలువురు నాయకులు, అభిమానులు కొనియాడారు. ఆయన జన్మదిన వేడుకలను గురువారం పింగల్ అన్న సేవాదళ్ ఆధ్వర్యంలో బీబీనగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు, పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు గోలి పింగల్ రెడ్డిని పూలమాలలతో సత్కరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి చెడుల్లో, కష్టనష్టాల్లో, సుఖదుఃఖాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, నమ్ముకున్న వారికి భరోసా కల్పించడం గోలి పింగల్ రెడ్డి ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలతో మమేకమై సేవలం దిస్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 23.10.2026
www.mudranews.in | @mudranews

జీర్ణక్రియకు అల్లం ఎంతో మేలు



అల్లం జీర్ణక్రియకు సహాయపడుతుంది. అజీర్ణి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడేవారికి అల్లం కొంత ఉపశమనం కలిగించవచ్చు. భోజనంలో అల్లాన్ని పరిమితంగా చేర్చుకోవడం మంచిది.

ప్రత్యేక డ్రైవ్ తో ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణ

కలెక్టర్ ప్రతిమాసింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు స్పీడ్ అప్ కావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం కలెక్టర్ ప్రతిమసింగ్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మాట్లాడారు. జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు స్పీడ్ అప్ కావడానికి మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వివరించారు. ఒక్కో అధికారి నాలుగైదు గ్రామాల్లో జరిగే ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించి, మొదటి, రెండో విడతలో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల లబ్ధిదారులను మోటివేషన్ చేసి నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. రానున్న



పది రోజుల్లో మొదలుకాని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మొదలు పెట్టేందుకే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణం వేగవంతంగా అయ్యేందుకు తీసుకోవలసిన చర్యలను తెలుసుకొని, ఆ దిశగా కృషి చేయాలన్నారు.ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఇళ్ల నిర్మాణాల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.మండలాల్లో నియామకమైన ప్రత్యేక అధికారులు గ్రామాల్లో మొదటి, రెండో విడతలో ఇండ్లు మొదలుపెట్టని లబ్ధిదారులతో నేరుగా కలిసి వారి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా అవగాహన కల్పించలన్నారు.ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు అతి తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా వివరించాలన్నారు.ఆర్థికంగా స్తోమత లేని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులపై ప్రత్యేక చొరవ చూపి తక్కువలో ఇల్లు పూర్తయ్యేలా సహకరించాలని సూచించారు.

యువకుడి హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

ముద్ర ప్రతినిధి, మెదక్: నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో యువకుడి హత్యకు సంబంధించిన కేసులో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి, న్యాయస్థానంలో నేరం నిరూపితమయ్యేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. రాంపూర్ గ్రామానికి చెందిన జిల్లా రాజారామ్ గౌడ్, యాదరం నాగరాజు గౌడ్ కుటుంబాల మధ్య గత కొంతకాలంగా పాత కక్షల నేపథ్యంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు ఘర్షణలు చోటుచేసుకోవడంతో నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 2020 మే 20న ఉదయం జిల్లా రాజారామ్ గౌడ్ కుమారుడు జిల్లా నర్సింలు గౌడ్ (28) గ్రామ శివారులోని బీడు భూమిలో తీవ్ర రక్తగాయాలతో పడి ఉండటాన్ని రాజారామ్ గౌడ్ గమనించారు. తన కుమారుడిని కాపాడాలంటూ ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. తనపై పాత కక్షలతో



కొందరు వ్యక్తులు రాళ్లు, కట్టెలు, పదునైన ఆయుధాలతో దాడి చేసినట్లు నర్సింలు గౌడ్ తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన నర్సింలు గౌడ్‌ను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నిజాంపేట ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేయగా, అప్పటి దర్యాప్తు అధికారి రామాయంపేట సీఐ నాగార్జున గౌడ్ సమగ్రంగా దర్యాప్తు చేసి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు.స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ఏడుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులలో యాదరం నాగరాజు గౌడ్,బంధారం లక్ష్మీ నారాయణ గౌడ్, బంధారం నాగరాజు గౌడ్, బంధారం నవీన్ గౌడ్, బంధారం గణేష్ గౌడ్,యాదరం శేఖర్ గౌడ్,యాదరం రమేష్ గౌడ్ ఉన్నారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, కోర్టు లైజన్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్, నిజాంపేట సీడీఓ మహేష్‌లను ఎస్పీ అభినందించారు.

ఢిల్లీలో మోదీతో పోలండ్ ప్రధాని భేటీ

ఇండియా-పోలండ్ మధ్య కీలక ఒప్పందాలు

ముద్ర, న్యూఢిల్లీ: ఇండియా–పోలండ్ మధ్య వ్యాపార, వాణిజ్య ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ మధ్య గురువారం న్యూఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య అనేక ఒప్పందాలు కుదిరాయి. పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ ఇండియాలో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్ వేదికగా ఇరు నేతలు, ఉన్నతాధికారుల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్యాన్ని 2030కల్లా రెట్టింపు చేయాలని నేతలు నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. పోలండ్, ఇండియా మధ్య కొనసాగుతున్న వ్యాపార, వాణిజ్య, ద్వైపాక్షిక, వ్యూహాత్మక భాగస్వామ్యంపై హర్షం వ్యక్తం చేశారు. పోలండ్ జీడీపీ 1 ట్రిలియన్ డాలర్లు దాటినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పోలండ్ ప్రధానికి అభినందనలు తెలిపారు. ఇండియాలో



పెట్టుబడులు పెట్టాల్సిందిగా పోలండ్ కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. పోలండ్‌లో ఇండియాకు చెందిన అనేక ఐటీ కంపెనీలు సేవలు అందిస్తున్నాయని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ఐటీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో మంచి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇండియా–పోలండ్ మధ్య స్టార్టప్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ మాట్లాడారు. ఇండియా–పోలండ్ మధ్య సంబంధాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రెండు దేశాలు ఒకదానికొకటి మద్దతుగా నిలుస్తూ, పరస్పరం ప్రయోజనం పొందాలన్నారు. ఇరు దేశాల్లో రాజకీయ సంక్షోభాలు తలెత్తినప్పుడు శాటిలైట్లు, డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు.ఇండియా స్థాయిని పోలండ్ ఎప్పటికీ తగ్గించబోదని ఆయన హామీ ఇచ్చారు. అరుదైన ఖనిజాలు, వనరులు వంటి విషయాల్లో ప్రతి దేశం స్వతంత్రంగా వ్యవహరించాలనే విషయాన్ని తాజా పరిణామాలు నిరూపించాయన్నారు. మరోవైపు.. రష్యా–ఉక్రెయిన్ అంశంపై ప్రధాని మోదీ స్పందించారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన శాంతి ప్రక్రియలో ఇండియా కీలకంగా ఉంటుందన్నారు. శాంతి స్థాపనకు ఇండియా కట్టుబడి ఉంటుందన్నారు. అది రష్యా–ఉక్రెయిన్ యుద్ధమైనా సరే.. మిడిల్ ఈస్ట్ సంక్షోభం అయినా సరే.. శాంతిస్థాపన కోసం అవసరమయ్యే అర్థవంతమైన చర్చలకు ఇండియా మద్దతు ఇస్తుందని మోదీ అన్నారు.

కాంగ్రెస్ మరో 30 ఏళ్లు అధికారంలోకి రాదు

రాహుల్ గాంధీపైనా అమిత్ షా విమర్శలు

ముద్ర, న్యూఢిల్లీ: రాబోయే 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కబోదన్నారు. న్యూఢిల్లీలో గురువారం యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమిత్ సా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి అధికారం దక్కబోదు. బూత్ స్థాయి కార్యకర్తల దగ్గరి నుంచి ప్రధాని మోదీ వరకు బీజేపీ నేతలు ప్రజలతో మమేకం అయి ఉంటారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. వోట్ చోరీ ఆరోపణలతో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలోని చొరబాటుదారులు, అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తున్నారు. వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయాన్ని దేశం మొత్తం అర్థం చేసుకుంది. కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం అధికారం చేపట్టేటప్పటికే.. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తన ఉనికి కోల్పోయింది. అనేక సందర్భాల్లో కోర్టులు రాహుల్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే అప్పుడు న్యాయం అంటారు.. అదే వ్యతిరేకంగా తీర్పు వస్తే కోర్టుల్నే ప్రశ్నిస్తారు. ఈ రకమైన ద్వంద ప్రమాణాలు పని చేయవు. ఢిల్లీ ప్రజల మనసు మార్చబోవు. ఢిల్లీలో 30 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేజ్రీవాల్ ప్రభుత్వాలు పూర్తి వ్యర్థాల్ని యమునా నదిలో వదిలేశారు. హరియాణా, యూపీ నుంచి కాలుష్య వర్థాలు, కలుషిత నీరు నదిలో కలిసింది. అందుకే హరియాణా, యూపీ ప్రభుత్వాలతో కలిసి ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. 2029లోపు యమునా నదిని ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. పంజాబ్‌లో ఆప్ పాలనలో డ్రగ్స్ వ్యాపారం బాగా వృద్ధి చెందింది అని అమిత్ షా ఆరోపించారు.



మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని ఫోన్

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రావాలని ఆహ్వానం



ముద్ర, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ చేశారు. ఇజ్రాయెల్‌లో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని మోదీని నెతన్యాహు కోరారు. ఈ విషయాన్ని నెతన్యాహు తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఇటీవల వార్తల్లో నిలిచిన భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని, టార్చ్ వెలిగించాలని నెతన్యాహు కోరారు. ఈ అంశంపై ప్రధాని మోదీ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇజ్రాయెల్ స్వాతంత్య్ర దినోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించినట్లు తెలిపారు. తాజా పరిణామాలపై చర్చించినట్లు తెలిపారు. ఇదే అంశంపై నెతన్యాహు కూడా స్పందించారు. నా స్నేహితుడు, ప్రధాని మోదీతో మాట్లాడాను. భారతీయ పైలట్, హీరో.. స్మిత్ మచ్చర్‌తో కలిసి ఇజ్రాయెల్ స్వాతంత్య్ర దినోత్సవాల్లో పాల్గొనాలని కోరాను. ఈ వేడుకలకు ఆహ్వానం పలికినందుకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఇండియా, ఇజ్రాయెల్ రెండు దేశాలు తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య ఉన్న సంబంధం గురించి మోదీ ప్రస్తావించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై హర్షం వ్యక్తం చేశారు అంటూ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ మేరకు మోదీతో ఉన్న ఫొటోను ఆయన షేర్ చేశారు. ఇదే సమయంలో ఇటీవల విమానం ప్రమాదం నుంచి ఇజ్రాయెల్ పౌరులను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌ను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. ఆయనతో కలిసి ప్రధాని మోదీ అక్కడ టార్చ్ వెలిగిస్తారు. మోదీ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఇజ్రాయెల్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే.

సాయన్న, కొమురం భీంకు నివాళులు



ముద్ర ప్రతినిధి, మెదక్: తెలంగాణ వీరత్వానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచిన పండుగ సాయన్న, కొమురం భీం జయంతి ఉత్సవాలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డిలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజల హక్కుల కోసం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, వివిధ మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుగ సాయన్న అందరికీ స్ఫూర్తి



ముద్ర ప్రతినిధి, మెదక్: అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం క్యాంప్ ఆఫీస్ లో పండుగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహించారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోముల శ్రీకాంత్, సర్పంచ్ రామకృష్ణయ్య, చింతల నర్సింలు, బీమరి శ్రీనివాస్, బండ నరేందర్, మామిళ్ళ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పోలీసులకు పదోన్నతి ర్యాంకులు



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న ఏడుగురు పోలీసు సిబ్బందికి పదోన్నతులు లభించాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు వారికి ర్యాంక్ చిహ్నాలు అలంకరించి అభినందించారు.కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న షరీఫ్, రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, వెంకయ్యలకు పదోన్నతులు లభించగా, టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంగయ్య, రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశం ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వారికి ర్యాంక్ చిహ్నాలను అలంకరించారు. పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయి. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్, అతని అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్, డిబివిఫ్, ఎంసిఎఫ్, ఏఐఏడబ్ల్యూయు, సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డిఆర్ఓ అంబదాస్, ఎస్పీ, డీపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టిస్కిలాబ్ బాబు మాట్లాడుతూ... బతుకమ్మ ఉత్సవాల్లో దళితులపై దాడి జరిగి 4 రోజులు అవుతున్నా ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ స్వయంగా లాటీలు తీసుకుని దళితులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దళితులపై దాడి చేసిన సర్పంచ్ ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో పని చేసే సిబ్బందిపై దాడి జరిగినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో తుప్రాన్ మండలం కిష్టాపూర్, మనోహరబాద్ మండలం కుచారం, శివ్వంపేట్ మండలం నవాబ్ పేట్ గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల్లో దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. ధర్నాకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ, సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశంలు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె నిరంజన్ దాసు, భాగయ్య, మల్లేశం, ఎంసిఎఫ్ జిల్లా ఇంచార్జి సంజీవ్, హెచ్ఆర్ఎఫ్ జిల్లా నాయకులు హామీద్ లతో పాటు దుర్గ, వెంకన్న, లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555